


# అద్దెకిచ్చిన హృదయాలు

— మల్లాది వెంకట కృష్ణమూర్తి

అరవై రెండు రూపాయలు ఆ గది అద్దె, కరెంటుకూడా కలిపి. అయినా, అచ్యుతం బాధపడలేదు. వెంటనే ఒప్పుకుని, అడ్వాన్స్ ఇచ్చేశాడు.

"అద్దె బాగా ఎక్కువ. దానికి ఇంకో పది రూపాయలు కలిపితే, సీతాఫల్ మండీలో మొగుడూ, పెళ్లానికీ సరిపడే ఇల్లు తేలికగా దొరుకుతుంది." అచ్యుతం స్నేహితులు అన్నారు.

"పర్వాలేదు. గాంధీహాస్పిటల్ కి దగ్గర. మెయిన్‌రోడ్డు మీదనే ఉంది ఇల్లు. పచ్చరంగు మేడ. మంచి హోటల్స్ కూడా దగ్గరలోనే ఉన్నాయి."

శనివారం సాయంత్రం కొత్త గది లోకి మారాడు అచ్యుతం, హైదరాబాదు నుంచి సికిందరాబాదుకి. మొత్తం సామానంతా ఓ టాక్సీలో తీసుకు వచ్చాడు. గంటన్నరలో సామానంతా రూమ్‌లో నీట్‌గా సర్దేశాడు.

గది బాగా సౌకర్యంగా ఉందని, అద్దె కొంచెం ఎక్కువయినా చేరాడు అచ్యుతం. చాలా పెద్ద ఇల్లు అది. అయిదు కుటుంబాలు అద్దెకు ఉంటు

వ్వాయి ఆ ఇంట్లో. ఇంటి ముందు ఆరు బయలు ప్రదేశం. బస్సు స్టాప్, స్టేషన్, పోస్ట్ ఆఫీసు, హోటల్స్, అన్నిటికీ మించి గాంధీ హాస్పిటల్ దగ్గర బాగా.

ఎమ్. బి. బి. ఎస్. పూర్తిచేసి హౌస్ సర్జన్ చేస్తున్నాడు అచ్యుతం. హాస్పిటల్‌కి దగ్గరలో ఉండాలనే తలంపుతో హైదరాబాదులో సీతారాంబాగ్ లోని గది ఖాళీ చేశాడు.

సర్దిన గది వంక చూశాడు. రెండు మూడు చిన్న మార్పులు చేసి, తృప్తిగా నిట్టూర్చాడు. కొంచెం కొంచెం చీకటి పడుతూండగా గుర్తుకు వచ్చింది అచ్యుతానికి, గదికి కావలసిన ఎలక్ట్రిక్ బల్బులు తనే తెచ్చుకోవాలని.

చదువుతున్న పుస్తకం మూసి, చెప్పులు తొడుక్కుని, గది తలుపు తాళం వేసి బయటికి వచ్చాడు అచ్యుతం.

ఆరుబయట కట్టి ఉన్న సిమెంట్ బెంచీల వంక చూశాడు అచ్యుతం, బయటికి నడుస్తూ. ఒకసారి గుండె ఆగి మళ్లీ మామూలుగా కొట్టుకో సాగింది.

సిమెంట్ బెంచీమీద కూర్చుని ఉన్నారు— ఆరుగురు అమ్మాయిలు. అందరూ ఇరవై ఏళ్ల లోపువాళ్లే. వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటున్నారు, నవ్వుకుంటూ.

గదిలోంచిబయటికివచ్చిన అచ్యుతాన్ని చూడగానే వాళ్లు మాటలు ఆపేశారు. అచ్యుతం వెళ్లిపోగానే మళ్లీ మాట్లాడుకో సాగారు.

తల వంచుకుని రోడ్డు మీదికి వెళ్లిపోయాడు అచ్యుతం, వాళ్ల వంక పరీక్షగా చూడకుండా. ఎలక్ట్రికల్ షాప్‌లో రెండు బల్బులు కొని, ఇరానీ రెస్టారెంట్‌లో టీ తాగి, కొత్త సిగరెట్ పాకెట్ కొనుక్కుని మళ్లీ రూముకి తిరిగి బయలుదేరాడు.

దూరంనుంచే గమనించాడు అచ్యుతం, ఆ ఆరుగురు ఆడపిల్లలని. రోడ్డు బయట గుమ్మం దగ్గర నిలబడి ఉన్నారు వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటూ.

అందరికన్నా పెద్దదిగా కనిపించే అమ్మాయి తెల్లటి చీర కట్టుకుని ఉంది. ఆ అమ్మాయి పోలికలు ఉన్న మరో అమ్మాయి ఫుల్ స్లీవ్స్ షర్ట్, బెల్‌బాటమ్ వేసుకుని ఉంది. నల్లగా ఉన్న ఓ అమ్మాయి పరికిణీ, జాకెట్టూ తొడుక్కుని ఉంది. అందరికన్నా తెల్లగా ఉన్న అమ్మాయి గౌన్‌లో మెరిసి పోతూంది. వయస్సులో చిన్నదిగా కనపడే ఓ అమ్మాయి స్కర్ట్, బ్లౌజులలో, మరో అమ్మాయి పంజాబీ డ్రెస్‌లలో ఉన్నారు.

రోడ్డుమీద నిలబడి నవ్వుతూ మాట్లాడుకుంటున్న ఆ ఆరుగురు రోడ్డుమీద పోయే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. వాళ్లని దాటి వెళ్లిన వాళ్లుకూడా వెనక్కి తిరిగి ఆ ఆరుగురిని చూసుకుంటూ నడుస్తున్నారు.

'అందరూ అందంగానే ఉన్నారు' అనుకున్నాడు అచ్యుతం మనసులోనే.

బాగా దగ్గరయ్యాడు అచ్యుతం వాళ్లకి. దగ్గరగా వచ్చిన అచ్యుతాన్ని గుర్తించగానే వాళ్ల మాటలూ, నవ్వులూ ఆపేశారు వెంటనే.

"పార్డన్ మి!"

గుమ్మానికి కొంచెం అడ్డుగా నిలబడి ఉన్న, చీర కట్టుకున్న అమ్మాయిని ఉద్దేశించి అన్నాడు అచ్యుతం: సిగ్గు పడ్డట్టుగా కనిపించింది. వెంటనే పక్కకి తప్పుకుంది. లోపలికి వెళ్లిపోయాడు అచ్యుతం.

తను గది గుమ్మం దగ్గరికి వెళ్లి, జేబు లోంచి తాళంచెవి తీసి గది తాళం తీసి, తలుపు తోసి లోపలికి వెళ్లేవరకూ, ఆ ఆరు జతల కళ్లు తన మీదే ఉన్నాయని గ్రహించాడు అచ్యుతం.

గది తలుపు దగ్గరికి వేసి, ఉన్న కొద్దిపాటి వెలుగులో బల్బు హోల్డర్‌కి తగిలించి లైటు వెలిగించాడు. టేబిల్ ముందు కూర్చుని, ఇందాక సగంలో చదివి వదిలేసిన పుస్తకం తెరిచి చదవ సాగాడు.

"స్వాతి!"

పావుగంట తరవాత వినిపించిందో పిలుపు.

"బర్తిని."

వెంటనే సమాధానం. చాలా తియ్యని కంఠస్వరం. ఏ భాషలో స్వాతి సమాధానం చెప్పిందో అచ్యుతానికి అర్థం కాలేదు.

మళ్లీ పుస్తకం మీదికి దృష్టి మళ్లించిన అచ్యుతానికి ఘల్లు ఘల్లున గజ్జెల చప్పుడు వినిపించింది. స్వాతి కాళ్లకి గజ్జెలు ఉన్నాయి, అనుకున్నాడు అచ్యుతం.

* * *

దాదాపు వారం రోజులు దాటి పోయాయి అచ్యుతం కొత్త గదిలోకి వచ్చి. రోజూ ఉదయం హాస్పిటల్‌కి వెళ్లడం, సాయంత్రం రావడం, సిగరెట్ తాగుతూ రాత్రి ఏదయినా పుస్తకం చదువుకోవడం. ఇంతే.

ఈ దినచర్య మధ్య అచ్యుతం అప్పుడప్పుడు గదిలోకి వస్తూండగానో, బాత్‌రూమ్‌కి వెళ్లేటప్పుడో ఆ ఆరుగురు అమ్మాయిలలో ఎవరినో ఒకరిని చూస్తూనే ఉన్నాడు. మొదట వాళ్లు అచ్యుతం వంక చూసీ చూడనట్లుగా చూసేవాళ్లు. క్రమంగా ఓరగా చూడటం, అది దాటి సూటిగా చూడటం మొదలు పెట్టారు.

అచ్యుతానికీ, వాళ్లకీ మధ్య పరిచయం చూపులతోనే అభివృద్ధి అయి పలకరింపుగా నవ్వుకోవడం దాకా వచ్చింది.

కాని, ఆ ఆరుగురిలో ఒక అమ్మాయి,- బహుశా అందరికన్నా పెద్దది—మాత్రం ఇంకా బెదురుగానో, సిగ్గుగానో చూస్తుంది అచ్యుతం వంక, ఓరగానే.

అచ్యుతం మనసు రోజూ రాత్రి పడుకోబోయేముందు చదివే పుస్తకాల మీద నిలవటం లేదు ఎక్కువ. ఆ ఆరుగురి చుట్టూ తిరుగుతూంది, తనకి తెలియకుండానే.

ఒక రోజు సాయంత్రం హాస్పిటల్ నుంచి తిరిగి రాగానే, బల్ల ముందు కూర్చుని ఉత్తరం మొదలుపెట్టాడు అచ్యుతం.

'అమ్మకు అచ్యుతం నమస్కరించి వ్రాయునది.'

మొదటి పేరా సగంలో ఉండగానే, "ఎక్స్‌క్యూజ్ మి" అన్న మాటలు వినపడ్డాయి.

తల ఎత్తి చూశాడు అచ్యుతం.

"ఎక్స్‌క్యూజ్ మి ఫర్ ది డిస్టర్బెన్స్. నా పేరు బియాట్రైస్."

"ప్లీజ్ కమిన్" అన్నాడు అచ్యుతం, పెన్ను టేబిల్ మీద పెట్టి.

వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చుంది బియాట్రైస్. గుండ్రని మొహం. బాబ్డ్ హెయిర్. తేనెరంగు కళ్లు. నిసనక్రల్లా ఉన్న కనురెప్పలు. గులాబి రంగు గౌనులో అందంగా ఇమిడిపోయి ఉంది బియాట్రైస్.

"కొత్తగా చేరారా ఈ గదిలో?" గదిలోని సామాను వంక పరీక్షగా చూస్తూ అడిగింది.

తల ఊపాడు అచ్యుతం, ఆ ప్రశ్నకి నవ్వుతూ.

"మీ పేరు?"

"అచ్యుతం."

"ఏం చేస్తారు? చదువుతున్నారా?"

"కాదు. హౌస్ సర్జన్."

అర్థం కాలేదు బియాట్రైస్‌కి.

"అంటే?" అడిగింది.

వివరంగా చెప్పాడు అచ్యుతం.

"అయితే, మా నాన్నగారికి మీరు ఇంజక్షన్స్ ఇవ్వచ్చు ఇకనుంచి. డాక్టర్ రానవసరం లేదు" అన్నది బియాట్రైస్ ఉత్సాహంగా.

"మీ నాన్నగారి ఆరోగ్యం సరిగా లేదా?" అడిగాడు.

"లేదు."

"నువ్వేం చేస్తున్నావు?"

"లెవెన్త్ స్టాండర్డ్ చదువు తున్నాను."

"ఎక్కడ?"

"సెయింట్ ఏన్స్."

ఇద్దరి మధ్యా ఇంగ్లీషులో నడుస్తూంది సంభాషణ. ఇంగ్లీషు చాలా బాగా మాట్లాడుతూంది — అనుకున్నాడు అచ్యుతం.

"ఆంగ్లో—ఇండియనా, నువ్వు?" అడిగాడు అచ్యుతం, తెల్లగా ఉన్న బియాట్రైస్‌ని చూస్తూ.

"అవును."

"ఇక్కడే అద్దె కుంటున్నారా?"

"అవును 'సి' పాటాలో."

"మీ నాన్నగారు ఏం చేస్తారు?"

"రైల్వే గార్డ్." చెప్పింది గర్వంగా. "మా నాన్న లేకపోతే రైలు నడవదు."

"ఎవ్వేళ్ళ [illegible]?"

"పదహారు నడుస్తోంది."

"బియాట్రైస్—చాలా మంచి పేరు అది."

"అమ్మా, నాన్నా నన్ను 'బెట్టీ' అని పిలుస్తారు. మీరుకూడా అలాగే పిలవండి."

"తప్పకుండా."

కొన్ని క్షణాలు బియాట్రైస్ కళ్లలోకి చూసి అన్నాడు: "బెట్టీ! నువ్వు చాలా అందంగా ఉంటావు."

తెల్లగా ఉన్న బెట్టీ బుగ్గలు ఎర్రబడటం స్పష్టంగా తెలుస్తూంది.

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్!" సిగ్గుతో పారిపోయింది బెట్టీ.

చిన్నగా నవ్వుతూ, బెట్టీ వెళ్లిన వైపే కొంచెం సేపు చూసి, అచ్యుతం టేబిల్‌మీద ఉన్న పెన్ అందుకుని మళ్లీ ఉత్తరం వ్రాయటం మొదలు పెట్టాడు, రెండవ పేరా మొదలు పెట్టి.

నాలుగయిదు వాక్యాలుకూడా పూర్తి కాలేదు రెండవ పేరాలో.

"మే ఐ కమిన్?" అన్న మాటలు వినపడ్డాయి, దీక్షగా ఉత్తరం వ్రాస్తున్న అచ్యుతానికి.

తల ఎత్తి చూశాడు గుమ్మం వంక. అచ్యుతం కళ్లు చమక్ మన్నాయి.

**ప్రార్థన**

ప్రార్థన వలన నీవు పాపాలకు దూరం అవుతావు. కానీ, పాపాలు చేస్తూ, ఆ పాపాలను కడిగివేసుకోవడానికై ప్రార్థన చేస్తే, ఆ ప్రార్థనలు భగవంతుడు వినడు.

—ఫుల్లర్

గుమ్మం దగ్గర నవ్వుతూ నిలబడి ఉంది ఓ బంగారు బొమ్మ.

తెల్లరంగు ఫ్రాక్, రెడ్ చెక్స్ బ్లౌజ్, పోనీ టెయిల్, కోల మొహం. చిలిపిగా చూసే నల్లటి కళ్ళు. నల్లటి బొట్టు.

"ప్లీజ్ కమిన్" అన్నాడు అచ్యుతం, పెన్ మూసి, టేబిల్ మీద పడేసి.

ఎర్రయంగా వచ్చి అచ్యుతం ఎదురు కుర్చీలో కూర్చుని, అచ్యుతం వంక చూసి నవ్వింది. నవ్వితే అందంగా సొట్టలు పడే బుగ్గలు.

"పేరు చెప్పలేదు" అన్నాడు అచ్యుతం, కొన్ని క్షణాలు రెప్ప వేయకుండా చూసి.

"చెప్పుకోండి చూద్దాం" అన్నది చిలిపిగా.

"స్వాతి?"

ఫక్కున నవ్వింది. నవ్వితే మళ్ళీ సొట్టలు పడే బుగ్గలు.

"కాదు" అన్నది గోడకు వేలాడు తున్న స్టెతస్కోప్ వంక చూస్తూ.

"మరేమిటి?"

"కనుక్కోలేకపోయారా?"

ఆ అమ్మాయి కళ్ళు ఎక్కడా నిశ్చలంగా నిలవడం లేదు. కళ్ళు తిప్పి గది అంతా పరిశీలనగా చూస్తోంది.

"కనుక్కోలేకపోయాను. ఏమిటి?" అడిగాడు అచ్యుతం. ఏమాత్రం కొత్త వాళ్ళన్న భయం ఉన్నట్లు లేదు. ఎంతో పరిచయస్థుడి గదిలో కూర్చున్నట్లుగా కూర్చుని, చురుకుగా ఉన్న ఆ అమ్మాయిని చూస్తే ముచ్చట వేసింది అచ్యుతానికి.

"నా పేరు సులోచన."

మాట్లాడుతూంటేకూడా సులోచన బుగ్గలు కొద్దిగా సొట్టలు పడుతున్నాయి, అందంగా.

"నా పేరు అడగలేదు" అన్నాడు అచ్యుతం.

"ఏమిటి?"

"కనుక్కో చూద్దాం." కొంటెగా అన్నాడు అచ్యుతం.

కొద్దిసేపు ఆలోచించినట్లుగా వేలితో నుదురు కొట్టుకుని అన్నది:

"అచ్యుతం."

"కరెక్ట్."

సంభాషణ అంతా పూర్తిగా ఇంగ్లీషు లోనే నడుస్తోంది.

"డాక్టరా మీరు?"

తల ఊపాడు అచ్యుతం.

లేచి గోడకి వేలాడుతున్న స్టెత్ అందుకుని అచ్యుతం దగ్గరికి వచ్చింది. స్టెత్ చెవులకి తగిలించుకొని కొన్ని క్షణాలు అచ్యుతాన్ని పరీక్ష చేసింది.

"సారీ! చేయి దాటిపోయింది" అన్నది సీరియస్‌గా చూస్తూ.

"డాక్టర్! ప్లీజ్, నన్ను బ్రతికించాలి మీరు!" అన్నాడు అచ్యుతం పేషెంట్‌లా నటిస్తూ.

సులోచన మొహంలోని చిలిపితనం స్థానంలో తెచ్చి పెట్టుకున్న సీరియస్‌నెస్‌ని చూస్తే నవ్వాగలేదు అచ్యుతానికి.

"బ్రతికించను. ఇన్నాళ్ళూ ఎందుకు ఆలస్యం చేశావు? ఇవెందుకు తాగుతావు?"

బల్లమీద సిగరెట్‌పెట్టె వంక చూపిస్తూ అన్నది. వెంటనే స్టెత్ తీసి టేబిల్‌మీద పడేసి, పకపకా నవ్వింది సులోచన.

"ఎన్నేళ్ళు నీకు?" అడిగాడు అచ్యుతం.

"పదకొండు నిండుతోంది."

నవ్వకుండా ఉండలేకపోయాడు సులోచన మాటలకి.

"పదిహేను. ఫిఫ్త్ ఫారమ్ చదువుతున్నాను."

సులోచన స్వచ్ఛమయిన ఇంగ్లీషు చక్కగా మాట్లాడుతుంది, వినసొంపుగా.

"మీకు ఇంగ్లీషు పొయిట్రీ వచ్చా?" అడిగింది, టేబిల్ పక్కన, షెల్ఫులో ఉన్న పుస్తకాలని చూస్తూ.

"వచ్చు."

"చెప్పడం వచ్చా?"

"వచ్చు."

"గుడ్, అయితే, రేపటినుంచి వస్తాను. సాయంత్రం నాకు ఇంగ్లీషు పొయిట్రీ, ప్రోజ్ చెప్పాలి. సరేనా?"

"సరే."

"థాంక్స్."

"ఎక్కడ నువ్వు ఉండేది?"

"'ఏ' బ్లాక్‌లో. సీ యు లేటర్."

సులోచన చటుక్కున ముందుకి వంగి, అప్పుడే అచ్యుతం చేతిలోకి తీసుకున్న సిగరెట్ అందుకుని అన్నది:

"దయచేసి సిగరెట్ కాల్చొద్దు."


సులోచన వెళ్ళగానే, వాన వచ్చి వెలిసినట్లుగా ఫీలయ్యాడు అచ్యుతం. అంత చురుకయిన అమ్మాయి ఎక్కడా తటస్థపడలేదు అతనికి.

రెండు నిమిషాలు ఆగాక మళ్ళీ కలం తెరిచి, మొదటినుంచీ ఉత్తరం చదివి, మళ్ళీ వ్రాయటం ప్రారంభించాడు.

రెండవ పేరా పూర్తిచేసి చివరి పేరాగ్రాఫ్ మొదలుపెట్టగానే, "సారీ ఫర్ ది ఇన్‌ట్రూజన్" అన్న మాటలు వినపడ్డాయి.

తల ఎత్తి చూశాడు అచ్యుతం.

పదిహేడేళ్ళుంటాయి ఆ అమ్మాయికి. అమాయకంగా చూసే కళ్ళు. కళ్ళనిండా కాటిక. నల్లటి ఒత్తయిన జుట్టు. కుదురయిన మొహం. కాఫీ డికాక్షన్ రంగు పంజాబీ డ్రెస్‌లో ఇంకా పచ్చగా కనపడుతూంది.



"లోపలికి రండి" అన్నాడు అచ్యుతం, మర్యాదగా.

తల వంచుకుని లోపలికి వచ్చి, అచ్యుతం ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

"నా పేరు అచ్యుతం." చెప్పాడు.

"నా పేరు ఆషా. 'డి' బ్లాక్‌లో అద్దెకి ఉంటున్నాం. మా నాన్నగారు పోస్ట్‌మాస్టర్."

భయపడుతూ చెప్పింది ఆషా.

ఆషా భయం, వణుకు చూసి అంత వరకు బహుశా ఏ మగాడితోనూ మాట్లాడి ఉండదనుకున్నాడు అచ్యుతం. టేబిల్ మీద అచ్యుతం పెట్టిన కలం వంక చూస్తూ మాట్లాడుతూంది.

"మీరు గుజరాతీలా?" అడిగాడు.

అవునన్నట్టుగా తల ఊపింది ఆషా.

"ఏం చదువుతున్నారు?"

"బి. ఎస్‌సి. . . . మీరు?"

తల ఎత్తి అచ్యుతం వంక చూసి, మళ్ళీ తల వంచుకుంది, కొంచెం సిగ్గుతో.

చెప్పాడు అచ్యుతం.

ఏమీ మాట్లాడలేదు ఆషా. నిశ్శబ్దంగా టేబిల్ మీద ఉన్న పెన్ వంక చూస్తూ కూర్చుంది.

"ఏ గ్రూప్ మీది?" అడిగాడు అచ్యుతం, కాస్సే పోగి.

చెప్పింది.

"మీకు సబ్జెక్ట్‌లో ఏమయినా సందేహాలు వస్తే నన్ను అడగవచ్చు. చెపుతాను."

"మీకు జువాలజీ బాగా వస్తుందా?" అడిగింది, కాస్సే పోగి.

"ఏం? మీకు చెప్పాలా?"

"మీకు వీలుంటేనే. క్లాస్‌లో ఫాలో అవలేకపోతున్నాను."

తొట్రుపాటు పడింది.

"ఫర్వాలేదు. రోజూ ఉదయం చెపుతాను. రండి."

"థాంక్స్. ఏమీ అనుకోకండి."

"నేనే థాంక్స్ చెప్పాలి మీకు. నాకు కోచింగ్ అంటే బాగా ఇష్టం."

మాట్లాడలేదు ఆషా.

"ఏ కాలేజీ?"

"ఉమెన్స్ కాలేజి."

సిగరెట్ వెలిగించాడు అచ్యుతం.

"మాట్లాడరేం? మీకు మాటలు ఎక్కువ రావా?" అడిగాడు.

నవ్వింది. సమాధానం చెప్పలేదు.

"మాట విలువ తెలిసిన వాళ్ళు ఎక్కువ మాట్లాడరు."

"నాది రిజర్వ్‌డ్ నేచర్."

"నాకు రిజర్వ్‌డ్ నేచర్ వాళ్ళంటేనే చాలా ఇష్టం."

"రేపు ఉదయం వస్తాను. ఏదో రాసుకుంటున్నట్లున్నారు. ఇంక డిస్టర్బ్ చేయటం నా కిష్టం లేదు."

"తప్పకుండా రండి."

గుమ్మం వంకే చూస్తూ కూర్చున్నాడు అచ్యుతం, ఆషా వెళ్ళిపోగానే ఇంకా ఎవరయినా వస్తారేమోనని. ఎవరూ రాలేదు. పావు గంట తరవాత మళ్ళీ కలం అందుకున్నాడు.

ఉత్తరం పూర్తిచేసి, మడిచి కవరులో


# దీనిని అలక్ష్యం చెయ్యకండి!




జలుబు తీవ్రపరిస్థితిని తీసుకురావచ్చును—రబెక్స్ రాయండి; ఒకేసారి గట్టిగా రాస్తే—జలుబుల నుండి రక్షణ నిచ్చి శక్తివంతముగా పనిచేయును.

* శీఘ్రంగా పనిచేస్తుంది-చర్మ గ్రంధులలోకి పోతుంది-శరీర వేడిమిని అధికంచేయును. * జలుబులను ఎదుర్కొను 7 వైజ్ఞానిక ఔషధులతో తయారైన రబెక్స్ శీఘ్రంగా పనిచేస్తుంది. దీని వలన అన్ని విధాల జలుబులకు ఉపశమనము కలుగును. రబెక్స్ ఛాతీలోని బిగుత్వమును సడలించి ముక్కు దిబ్బడను, తలనొప్పిని పోగొట్టును.

6 గ్రాముల డబ్బాలలో, 20 గ్రాముల మరియు 65 గ్రాముల సీసాలలో దొరకును.




# రబెక్స్

everest/371a/ACW Tel

పెట్టి, కవరు అతికించి, పైన అడ్రెసు వ్రాశాడు.

కిటికీలోంచి ఆడపిల్లలు ఇంగ్లీషులో మాట్లాడుకునే మాటలు లీలగా వినిపిస్తున్నాయి అచ్యుతానికి.

## 2

మర్నాడు ఉదయం ఉత్తరం పోస్ట్ బాక్స్‌లో వేసి వద్దామని బయలుదేరుతూంటే, తలుపు తెరవగానే ఎదురుగా అమ్మాయిలు కనబడ్డారు.

ఈసారి ఇద్దరు!

"కమిన్ ప్లీజ్!"

అడ్డు తప్పుకొన్నాడు అచ్యుతం.

ఇద్దరూ సిగ్గు పడుతూ లోపలికి వచ్చారు. చీర కట్టుకుని ఉంది ఒక అమ్మాయి. కనుకట్టు, తీరు అందంగా ఉన్నాయి. ముఖంలో భయంతో కూడిన సిగ్గు. వక్క రంగు చీరలో తెల్లటి ఒంటి తెలుపు స్పష్టంగా తెలుస్తూంది. ఎర్రగా ఉన్నాయి పెదిమలు. లిప్‌స్టిక్ రాసుకున్న ఎరుపు కాదు. సహజంగా ఉన్న ఎరుపు. తడితో మెరుస్తున్నాయి.

చీర కట్టుకుని ఉన్న అమ్మాయి పోలికలు గల మరో అమ్మాయి పక్కనే ఉంది. చెల్లెలు అనుకున్నాడు అచ్యుతం.

గ్రీన్ చెక్స్ ఫుల్ స్లీవ్స్-షర్ట్. గ్రీన్ కలర్ కాటన్ బెల్‌బాటమ్స్. కత్తిరించుకున్న జుట్టు. మొహంలో సిగ్గు ఇంకా ఎక్కువగా తొంగి చూస్తూంది.

చీరలో ఉన్న పెద్దమ్మాయే ధైర్యం చేసి అన్నది. "మేము 'ఇ' బ్లాక్‌లో అద్దెకి ఉంటున్నాము."

"ప్లీజ్డ్ టు మీట్ యు."

"నిన్న మా స్నేహితులంతా వచ్చి పరిచయం చేసుకున్నారుట. నిన్న రాలేకపోయాము మేము" అన్నది చిన్న చీరలో ఉన్న అమ్మాయి.

"మీ పేరేమిటి?"

"నా పేరు చిత్ర. ఇది స్వాతి. నా చెల్లెలు." పరిచయం చేసింది అమ్మాయి.

"రండి. కూర్చోండి."

బల్ల దగ్గరికి వెళ్ళి కూర్చున్నారు ముగ్గురూ కుర్చీల్లో.

"నా పేరు మీకు ఈ పాటికి తెలిసిపోయి ఉండాలి" అన్నాడు అచ్యుతం నవ్వుతూ.

"తెలుసు. ఆషా చెప్పింది." చెప్పింది స్వాతి.

" 'బర్తిని' అంటే ఏమిటి?" అడిగాడు అచ్యుతం.

"వస్తున్నాను అని అర్థం."

"ఏ భాష అది?"

"కన్నడం."

"మీరు కన్నడం వాళ్ళా?"

"అవును. మైసూరు స్టేట్‌లో హాసన్ జిల్లా మాది. మా నాన్నగారు ఇక్కడ అగరుబత్తులు, తేనె వ్యాపారం చేస్తారు."

"కూర్గ్ తేనె మంచిది కదూ?" అడిగాడు.

తలలు ఊపారు ఇద్దరూ.

"మీకు తేనె అంటే ఇష్టమా?" అడిగింది స్వాతి.

"తేనె అంటే ఎవరికి ఇష్టం ఉండదు?"

నవ్వారు ఇద్దరూ.

"తేనె కాకుండా మరోటన్నా ఎవరికయినా ఇష్టమే."

"అగరుబత్తి?" అడిగింది స్వాతి.

"కాదు."

"ఏమిటి?"

"తరవాత చెపుతాను."

"డాక్టర్ కోర్స్ కష్టం కదూ?" అడిగింది చిత్ర.

"అవును. బాగా కష్టం. చాలా కృషి చేయాలి." చెప్పాడు అచ్యుతం.

"ఎక్కడికో పనిమీద వెళుతున్నట్టున్నారే?" అడిగింది స్వాతి, అచ్యుతం చేతిలోని కవరు వంక చూసి.

"ఉత్తరం పోస్ట్ చేద్దామని."

"మేం వెళతాం."

చిత్ర లేవగానే, స్వాతికూడా లేచి నిలబడింది.

"అప్పుడప్పుడు వస్తూండండి." చెప్పాడు అచ్యుతం.

"తప్పకుండా."

ఇద్దరూ వెళ్ళిపోయారు.

గుమ్మందాకా వెళ్ళిన అచ్యుతం మళ్ళీ వెనక్కి తిరిగి టేబిల్ దగ్గిరికి వచ్చి చేతిలోని ఉత్తరం జేబులో పడేసుకుని, రైటింగ్ పాడ్, పెన్సిల్ అందుకున్నాడు.

కొన్ని క్షణాలు ఆలోచించి, తన గదిలోకి పరిచయం చేసుకోవడానికి వచ్చిన అమ్మాయిల పేర్లు, వాళ్ళుండే బ్లాకుల పేర్లు వ్రాశాడు వరసగా.

బెట్సీ, సులోచన, ఆషా, చిత్ర, స్వాతి. మొత్తం ఆరుగురు అమ్మాయిలని చూశాడు తను. అయిదుగురే వచ్చారు గదికి. ఇంకో అమ్మాయి రాలేదు. రైటింగ్ పాడ్‌లో 'బి' బ్లాక్ కనపడలేదు. పరికిణీ, జాకెట్టులో చూసిన ఆ అమ్మాయి బహుశా 'బి' బ్లాక్‌లో ఉండవచ్చు అనుకున్నాడు అచ్యుతం.

పాడ్‌మీద తను వ్రాసిన పేర్ల వంక చూస్తూ, ఆ అయిదుగురు అమ్మాయిల గురించి ఆలోచిస్తున్నాడు అచ్యుతం. అయిదుగురూ అందమయిన వాళ్ళే, చదువుకున్నవాళ్ళే!

అయిదు నిమిషాలు గడిచాయి. పాడ్ మూసి వెనక్కి తిరిగాడు.

గుమ్మం దగ్గర చేత్తో రెండు పుస్తకాలు పట్టుకుని నిలబడి ఉంది ఆషా.

"హలో! రండి. అక్కడే నిలబడ్డారే? పిలవలేకపోయారా?" అన్నాడు నవ్వుతూ.

"మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యటం ఇష్టం లేక. . ." నసిగింది.

పకపకా నవ్వాడు అచ్యుతం.

"నా దగ్గర పాఠాలు నేర్చుకోవాలంటే ముందర మీకు నే నంటే భయం పోవాలి. ఫ్రీగా ఫీలవకపోతే మీకు చెప్పటం కష్టం."

అలాగే నన్నట్టుగా చూసింది, భయంగానే.

"కూర్చోండి."

నడిచి వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చుంది ఆషా.

"జువాలజీ కదా? చెపుతాను. శ్రద్ధగా వినండి. ఎక్కడయినా తెలియక పోతే వెంటనే అడగండి, భయపడకుండా. ఏమీ అనుకోను నేను. సరేనా?"

తల ఊపింది.

పుస్తకం అందుకునేందుకు చెయ్యి చాపాడు అచ్యుతం. పుస్తకం అందిద్దామనే ఉద్దేశ్యంతో, సరిగ్గా అదే సమయంలో చెయ్యి చాపింది ఆషా. ఇద్దరి చేతులూ జువాలజీ పుస్తకం మీద కలుసుకున్నాయి.

చటుక్కున చెయ్యి వెనక్కి తీసుకుంది ఆషా బెదురుగా.

ఆషా కళ్ళలోకి చూశాడు. ఆషా కళ్ళు అచ్యుతం కళ్ళలోకి చూస్తున్నాయి. కళ్ళలో ఇదివరకటి భీతి లేదు. నవ్వుతున్నాయి.

---

# "అక్టోబర్-2..."

## వి. సంపత్కుమారాచార్య

అక్టోబర్ రెండు! అక్టోబర్ రెండు!!...
జాతిపిత పుట్టినరోజు!... అక్టోబర్
రెండు!!...
లాల్ బహదూర్ పుట్టినరోజు!... అక్టోబర్
రెండు!!...

మహాత్ముడై ... జాతిని జాగరితం చేసి
అస్వతంత్రతా తమోనిర్హరణ మొనర్చిన
నాయకు డొకడు!... మనలో
నిద్రాణమైన పౌరుషానికి ప్రాణం పోసి
ప్రౌఢిమతో ముందుకు నడపిన
అభినవ నాయకు డొకడు!!...

శాంత్యనోపాయాలతోనే
స్వాతంత్ర్యం సాధించిన సాధీయసు
డొకడు! ..
దురధ్వ గమనులు కయ్యానికి కాలుదువ్వి
శాంత కాసారంలో సుడిగుండాలు సృష్టించి
నపుడు
విజయునివలె అజేయుడై నిలచిన
చిరస్మరణీయు డొకడు!!

అట్టి మహా నాయకుల ... అభ్యుదయ వీరుల
జన్మదినం అక్టోబర్ రెండు!......
ఈ నాడందరికి పర్వదినం!...
ఏ నాటికి మరువదగని సుదినం!! ★

"సో సారీ!" అన్నాడు అచ్యుతం, పుస్తకం అందుకుని.

"నో. ఐయామ్ సారీ" అన్నది ఆషా.

"నో, నో. ఉయార్ హాపీ. హైనా?" పుస్తకం తెరిచాడు అచ్యుతం నవ్వుతూ. పెన్సిల్ అందుకుని రైటింగ్ పాడ్ తెరిచాడు, పాఠం మొదలు పెట్టడానికి.

పాడ్‌లో ఇందాక తను వ్రాసిన పేర్లు కనపడ్డాయి వరసగా. ఆరో నంబరు ఎదురుగా పేరు లేదు ఏమీ. ఖాళీగా ఉంది.

పేర్లు బిగ్గరగా చదివాడు అచ్యుతం.

"ఇంతేనా, ఇంకా ఎవరయినా ఉంటు న్నారా ఇక్కడ?" అడిగాడు ఆషాని.

"ఇంకొక అమ్మాయి ఉంది. పేరు వసంత. వాళ్ల అమ్మకి తెలిస్తే కోప్పడు తుందని రాలేదు." చెప్పింది ఆషా.

"వాళ్లమ్మ ఎందుకు కోప్పడుతుంది?"

"మంచిది కాదు. సవతి తల్లి. స్వంత తల్లి చచ్చిపోయింది. మంచి బట్టలు కట్టుకోనివ్వదు. ఎక్కడికీ వెళ్లనివ్వదు."

"మరి వాళ్ల నాన్న?"

"వాళ్ల అమ్మ మాటే వింటాడు."

"పాపం! పరికిణీ, జాకెట్టు వేసు కుంటుంది. వసంతేనా?" అడిగాడు, కొంచెంసేపు పుస్తకం వంక చూసి.

"అవును."

"పద్నాలుగేళ్లుంటా యనుకుం టాను."

"అవును. స్కూలుకు కూడా పంపరు."

"మీ అమ్మా, నాన్నలకి ఇష్టమే గదా మీరు ఇక్కడికి రావడం?" అడి గాడు అచ్యుతం, ఆషా మొహంలోకి చూసి నవ్వుతూ.

"తెలుసు. ఇష్టమే."

"గుడ్, లెటజ్ ప్రొసీడ్."

అర గంటపైగా చెప్పాడు అచ్యుతం, జువాలజీ. దీక్షగా విన్నది ఆషా. మధ్య మధ్యలో, పెన్సిల్‌తో తను తెచ్చుకున్న పుస్తకంలో నాన పాయింట్స్ వ్రాసుకుంది.

"మళ్లీ రేపు రండి. ఇవాళకి చాలు" అన్నాడు పుస్తకం మూసి అందిస్తూ.

మళ్లీ ఇద్దరి చేతులూ తగిలాయి.

"థాంక్స్. రేపు వస్తాను."

పంజాబీ డ్రెస్‌లో ఉన్న ఆషా వెళ్లి పోయింది.

తను బయటికి ఎందుకు బయలు దేరిందో గుర్తుకు వచ్చింది అచ్యుతానికి. ఉత్తరం పోస్ట్‌లో వేసేందుకు. టేబిల్ మీద చూశాడు.

ఉత్తరం లేదు.

గబగబా టేబిల్ మీద, పుస్తకాలకింద, డ్రాయర్లో వెదికాడు ఉత్తరం కోసం. కనపడలేదు.

విసుగ్గా కుర్చీలో కూర్చున్నాడు.

తను ఈ గదికి వచ్చి నెల దాటుతూంది. తన వంక స్నేహభావంగా చూసేవాళ్ళు ఆ ఆరుగురు అమ్మాయిలు. ఇప్పుడు వచ్చి పరిచయం చేసుకున్నారు, ఒకరి తరవాత మరొకరు. అందరూ మంచి వాళ్లే. సహృదయులే.

చటుక్కున గుర్తుకు వచ్చింది అచ్యుతానికి, ఉత్తరం తను జేబులో పెట్టుకున్నట్టు. వెంటనే లేచాడు, ఉత్తరం పోస్టులో వేయడానికి.

'ఇంతమంది ఆడపిల్లల మధ్యలో ఉంటే నాకు మతి పోతుంది.' గొణుక్కున్నాడు అచ్యుతం, గది తలుపు తాళం వేస్తూ.

## 3

ఆ రోజు సాయంత్రం హాస్పిటల్ నుంచి గదికి వచ్చేశాడు అచ్యుతం, తిన్నగా. మధ్యలో టీ తాగడానికి మాత్రం ఆగాడు ఇరానీ రెస్టారెంట్‌లో.

అచ్యుతం వచ్చిన అయిదు నిమిషా లలో వచ్చేసింది సులోచన, కాన్వెంట్ డ్రెస్‌లోనే, చేతిలో పుస్తకాలతో.

"ఇంగ్లీష్ పాఠం చెప్పండి" అన్నది, ఎదురుగా టేబిల్ ముందు కుర్చీలో కూర్చుని.

"ఇప్పుడే వచ్చాను—కొంచెం సేపయిన తరవాత" అన్నాడు అచ్యుతం, హాస్పిటల్‌కి వేసుకు వెళ్లే తెల్లకోటు హాంగర్‌కి తగిలిస్తూ.

"అదేం కుదరదు. ఈవేళ త్వరగా వెళ్లాలని నిన్ననే చెప్పాను. త్వరగా చెప్పండి."

సులోచన మాటలకు కోపం రాలేదు అచ్యుతానికి. నవ్వు వచ్చింది.

"అయితే, పుస్తకం తెరు."

సిగరెట్ పెట్టె తెరిచి సిగరెట్ నోట్లో పెట్టుకుని, టేబిల్ మీద వెతకసాగాడు అగ్గిపెట్టె కోసం.

"నీ దగ్గర ఉందా?" అడిగాడు సులోచన వంక అనుమానంగా చూసి. టేబిల్ మీద లేదు అగ్గిపెట్టె.

కిలకిలా నవ్వింది సులోచన.

"ప్లీజ్. ఇవ్వు."

"ఇవ్వను." తల అడ్డంగా ఊపింది.

"అయితే, పాఠం చెప్పను." బెదిరించాడు అచ్యుతం.

"సిగరెట్టు తాగితే కాన్సర్ వస్తుంది."

"రాదు."

"వస్తుంది."

"రాదు. నేను డాక్టర్‌ని. నా కంటే ఎక్కువ తెలుసా?"

"తెలుసు. ప్లీజ్. సిగరెట్స్ మానే యండి."

"చాలా కష్టం."

"అసలు ఎలా అలవాటయింది?"

"చిన్నప్పుడు బాగా పడిశం వచ్చేది నాకు. దగ్గు, తుమ్ములు విపరీతంగా వచ్చేవి. డాక్టర్ నవ్వుతూ అన్నాడు— 'సిగరెట్టు తాగితే అవి తగ్గిపోతా'యని."

"ఎన్నేళ్లప్పుడు?"

"పదిహేనో, పదహారో."

"పడిశం పోయింది కాని, సిగరెట్టు పోలేదు. అవునా?" పకపకా నవ్వింది సులోచన.

నవ్వుతున్న సులోచన సొట్టలు పడే బుగ్గల వంక చూస్తూండిపోయాడు అచ్యుతం.

"దయచేసి సిగరెట్స్ మానేయండి. నాకోసం."

"ఆఖరిసారి. . ."


సులోచన అచ్యుతం నోట్లోని సిగరెట్టు లాక్కుని అన్నది, చిలిపిగా చూస్తూ— "ఎక్కువ స్వాతంత్ర్యం తీసుకొంటు న్నాను. అవునా?"

"అవును" అన్నాడు అచ్యుతం కోపంగా.

"సిగరెట్స్ మానండి. పాఠం చెప్పండి."

"అయితే, పుస్తకం తెరు."

కోపంగా ఉన్న అచ్యుతం ముఖం వంక ఓరగా చూస్తూ పుస్తకం తెరిచింది సులోచన. అరగంట పైగానే చెప్పాడు అచ్యుతం షెల్లీ గురించి. శ్రద్ధగా వింది సులోచన. వింటూనే చుట్టూ చూస్తుంది. టేబిల్ మీద పుస్తకాలు సద్దుతుంది. రెండు నిమిషా లాగి మళ్లీ వాటినే సద్దుతుంది. అరగంట కదలకుండా కూర్చుంది అతి కష్టం మీద.




ఇది ఒక్కటే
100% TERENE
అల్లిక చొక్కా గుడ్డ-
space king! by Cottex
గాలి ఆడే నేత. 100%
'టెరీన్' అల్లికకు తోడు క్రొత్త
డిజైనులు మరియు ముచ్చటవేసే
రంగులలో దర్జాయైనవి...
'స్పేస్ కింగ్' అల్లిక చొక్కా
గుడ్డలు, సొగసైన దుస్తులు
వేసుకొనే సరసులైన వారికి తగినవి.
కోటెక్స్ ప్రైవేట్ లిమిటెడ్
(యూనివర్సల్ టెక్స్‌టైల్స్ వారి
ఒక విభాగము)
రెషర్ రేంజ్, ఎల్.బి.ఎస్. మార్గ్
ఘాట్‌కోపర్, బొంబాయి-86.
వ్యాపార వివరములకు వ్రాయండి:
ఎస్. ఎన్. మాండెల్యా
203, కల్బాదేవి రోడ్, బొంబాయి-2
డిస్ట్రిబ్యూటర్లు: చెల్లారామ్స్, 3/4, గోడౌన్ స్ట్రీట్, మద్రాసు • రాజా మార్కెట్ చిక్‌పెట్, బెంగుళూరు • ఆబిడ్ రోడ్, హైదరాబాదు.
తుల్సీదాస్ వి. పటేల్, నవీ గల్లీ, స్వదేశీ మార్కెట్, కల్బాదేవి రోడ్, బొంబాయి-2. లాల్ ట్రేడర్స్, 23, కకడ్ మార్కెట్, కల్బాదేవి రోడ్, బొంబాయి-2. ద్వారకాదాస్ రామేశ్వర్ గోయెంకా, 259, కల్బాదేవి రోడ్, బొంబాయి-2.
Dattaram-CP-5TL

# అద్దెకిచ్చిన హృదయాలు

మల్లాది వెంకట
కృష్ణమూర్తి




(క్రిందటి సంచిక తరువాయి)

4

"మీా కోసమే ఎదురు చూస్తున్నాము. ఇంత ఆలస్యం అయిందే?" అడిగింది బెట్టీ, గది తలుపు తాళం తీస్తున్న అచ్యుతాన్ని.

"హోటల్‌లో భోజనం చేసి రావాలి కదా?" అన్నాడు అచ్యుతం. తలుపు తెరిచి లోపలికి వెళ్ళి, లైటు వెలిగించాడు. అచ్యుతం వెనకనే వచ్చింది బెట్టీ.

"మీరు నాకు చెప్పనే లేదు" అన్నది బెట్టీ, పుస్తకాల రాక్ వంక పరీక్షగా చూస్తూ.

"ఏమిటి?" అడిగాడు అచ్యుతం, టై విప్పుతూ.

"ఆ సంగతే" అన్నది బెట్టీ, ఇంకా పుస్తకాల రాక్ వంక చూస్తూ.

"ఏ సంగతి?" అడిగాడు అచ్యుతం.

రాక్ దగ్గరికి వెళ్లి, అన్నిటికన్నా లావుగా ఉన్న పుస్తకం బయటికి లాగింది బెట్టీ.

"ఈ సంగతి" అన్నది పుస్తకాన్ని చేత్తో తట్టుతూ.

"ఏముంది? అది నా అనాటమీ పుస్తకం" అన్నాడు అచ్యుతం, బెట్టీ వంక వింతగా చూస్తూ.

"కన్నింగ్ యు ఆర్!" అన్నది బెట్టీ చిరుకోపంతో.

"ఏమిటి? నాకు అర్థం కాలేదు.'

"ఈ పుస్తకంలోని ఫోటో."

"ఏం ఫోటో?"

"నాకు ఎప్పుడూ చెప్పలేదే మీరు? సులోచన అంతా చెప్పింది. ఎవ రా అమ్మాయి?"

తెల్లబోయాడు అచ్యుతం.

"అందులో అమ్మాయి ఫోటో లేమీ లేవు."

"అబద్ధం ఆడకండి. సులోచన చెప్పింది. మీ గర్ల్ ఫ్రెండా?"

"నిజంగా చెపుతున్నాను. అందులో అమ్మాయి ఫోటో లేమీ లేవు. నాకు గర్ల్ ఫ్రెండ్స్ లేరు."

"ఇప్పుడే తీసి చూపిస్తాను. నాకు పేజీ నంబర్ కూడా చెప్పింది సులోచన."

గబగబా పుస్తకం తెరిచి, పేజీలు తిప్పి ఓ పేజీ దగ్గర ఆగిపోయింది బెట్టీ.

దగ్గరికి వెళ్లి వంగి చూశాడు అచ్యుతం, పుస్తకంలోకి ఆసక్తిగా.

పకపకా నవ్వాడు ఆ బొమ్మని చూసి.

"బాగుందా నా గర్ల్ ఫ్రెండ్?" అడిగాడు.

అస్థిపంజరం బొమ్మ ఉంది పుస్తకంలోని ఆర్ట్ పేపర్ మీద.

"థాంక్ గాడ్!"

పుస్తకం మూసి బెట్టీ రాక్‌లో యథాస్థానంలో పెట్టింది.

"అబద్ధం చెప్పింది. సులోచన బాగా అల్లరి చేస్తుంది. మిస్‌చీవస్" అన్నది బెట్టీ.

అచ్యుతం నవ్వుతూ చూశాడు బెట్టీ కళ్లలోకి.

"గర్ల్ ఫ్రెండ్స్ లేరా మీకు!" అడిగింది బెట్టీ మళ్లీ.

"దేనికి?"



దైవసన్నిధి — ఫోటో—భరద్వాజ

"ఊరికే. చెప్పండి."

"లేరు." అబద్ధం చెప్పాడు అచ్యుతం కావాలని.

బెట్టీ అచ్యుతం వంకే చూస్తూ ఉండిపోయింది కొన్ని క్షణాలు. ఏదో చెప్పాలనుకుంటూంది కాని, చెప్పలేకపోతూంది అని గ్రహించాడు అచ్యుతం, బెట్టీ మొహంలోని భావాలని బట్టి.

"నీకు బాయ్ ఫ్రెండ్స్ లేరా?"

"లేరు."

"ఏమిటి చెప్పాలనుకొంటున్నావు?" అడిగాడు అచ్యుతం.

"ఏం లేదు."

తల వంచుకుంది బెట్టీ సిగ్గుగా. సిగ్గు పడుతున్న బెట్టీ ఇంకా అందంగా కనిపించింది అచ్యుతానికి.

"ఫర్వాలేదు, చెప్పు. ఏమిటి?"

"మీరు ఏమీ అనుకోరుగా చెబితే?"

"చెప్పకపోతేనే ఏమయినా అనుకుంటాను."

"వెల్... నాకు చేత కాదు ఎలా చెప్పాలో."

"ప్రయత్నించు."

"నేను... మీరు" అని కాస్సేపాగి, "నాకు చేతకాదని చెప్పానుగా" అన్నది నిస్సహాయంగా.

అందంగా ఉన్న బెట్టీ మొహంలోకి చూసి చిన్నగా నవ్వి అన్నాడు అచ్యుతం: "పోనీ, నేను చెప్పనా నువ్వేం చెప్పాలనుకుంటున్నావో?"

తల ఊపింది బెట్టీ.

"ఆ టేబుల్ మీద డిక్షనరీ ఉంది. దానిలో ఒక పేజీ మధ్య పెన్సిల్ అడ్డంగా పెట్టి ఉంది. అది తెరిచి చూడు."

"నేను చెప్పాలనుకున్నది అక్కడ ఉంటుందా?" అడిగింది బెట్టీ అనుమానంగా.

"ఉంటుందనుకొంటాను."

బెట్టీ గుండెలు విపరీతంగా కొట్టుకోవడం వినపడుతూంది అచ్యుతానికి. టేబుల్ దగ్గరికి నడిచి, డిక్షనరీ తెరిచింది బెట్టీ.

"నువ్వు చెప్పాలనుకున్నది పెన్సిల్‌తో అండర్‌లైన్ చేసి ఉంటుంది. అదేనా?"

"లవ్!" పైకి గట్టిగా చదివింది బెట్టీ, అప్రయత్నంగా. టక్కున డిక్షనరీ మూసేసింది.

"కరెక్ట్?"

"యు ఆర్ కరెక్ట్."

"అయితే, ఇప్పుడు చెప్పు పూర్తిగా నువ్వు చెప్పాలనుకున్నది" అన్నాడు అచ్యుతం నవ్వుతూ.

"నో. నాకు సిగ్గు."

గుమ్మం వైపు పరుగెత్తింది బెట్టీ.

"వెయిట్ ఎ మినిట్!"

అచ్యుతం పిలిచినా ఆగకుండా బయటికి పరుగెత్తింది బెట్టీ.

కొన్ని క్షణాల తరవాత — "మీ పెన్సిల్" అన్న బెట్టీ మాటలు వినపడ్డాయి.

డిక్షనరీలో పెట్టిన పెన్సిల్ అచ్యుతం మీద వచ్చి పడ్డది బయటినుంచి.

• • •

రోజూ ఉదయం పుస్తకాలతో వస్తుంది ఆషా, పాఠం చెప్పించుకోవడానికి. ఇదివర కున్నంత బెదురూ, భయం లేవు. అచ్యుతం బాగా చనువుగా ఉండి, వీలయినంత దగ్గరగా రానిస్తున్నాడు ఆషని మామూలుగా.

అచ్యుతం వంక చూసి స్నేహపూర్వకంగా నవ్వింది ఆషా.

"కూర్చో" అన్నాడు అచ్యుతం, రేజర్‌లో బ్లేడ్ ఎక్కిస్తూ.

కుర్చీలో కూర్చుంది ఆషా. పుస్తకాలు టేబుల్ మీద పెట్టి అన్నది అచ్యుతంతో: "వసంత మీతో చెప్పమన్నది. అందరూ వచ్చి మిమ్మల్ని చూసి మాట్లాడుతున్నారు. తను రాలేకపోయింది. ఏమీ అనుకోవద్దని చెప్పమంది."

"దేనికీ రాలేకపోవడం?" అడిగాడు అచ్యుతం.

"స్టెప్ మదర్."

"వసంతతో చెప్పు, నాకు మాట్లాడాలనుందని" అన్నాడు అచ్యుతం, కొన్ని క్షణా లాగి.

"గుమ్మం దగ్గరికి వెళ్లి చూడండి. బయటే ఉంది. కనపడుతుంది మీకు."

రేజర్ బిగించి, గుమ్మం దగ్గరికి నడిచి బయటికి చూశాడు అచ్యుతం. వసంత నిలబడి ఉంది దూరంగా, చేతిలో చీపురుతో. అది 'ఇ' బ్లాక్. ఊడుస్తూంది.

పధ్నాలుగేళ్లుంటాయి. పల్లటి పావడా, ఎర్ర రంగు జాకెట్. రెండు జడలు కాదు, ఒక జడ. ఆ వయసులో రెండు జడలు వేసుకోవాలనే ముచ్చట తీరనివ్వదు వసంత సవతి తల్లి అనుకున్నాడు అచ్యుతం. పధ్నాలుగేళ్లు నిండుతున్నా, ఓణీలు వేసుకోవలసిన అవసరం ఉన్నా, ఇంకా ఓణీలు వేయనివ్వడం లేదు ఆవిడ. చామనఛాయగా ఉన్నా, ఆకర్షణీయంగానే ఉన్నది వసంత.

ఊడవడం ఆపి అచ్యుతం వంక చూసింది వసంత. చిన్నగా నవ్వి, చెయ్యి ఊపాడు అచ్యుతం. బెదురుతూ చుట్టుపక్కల చూసింది వసంత, తను నెవరయినా గమనిస్తున్నారేమోనని. ఎవరూ లేకపోవడంతో చిరునవ్వు నవ్వింది బదులుగా.

ఇంటి లోపలినుంచి ఒకావిడ వచ్చింది బయటికి. సవతి తల్లి కావచ్చు. చటుక్కున లోపలికి తప్పుకున్నాడు అచ్యుతం.

చేతిలో రేజర్‌తో అద్దం ముందు వెళ్లి నిలబడ్డాడు అచ్యుతం.

"కనపడ్డదా?" అడిగింది ఆషా.

"కనపడ్డది." చెప్పాడు అచ్యుతం, గడ్డానికి బ్రష్‌తో సబ్బు రాసుకుంటూ.

"కొంచెం సేపాగి రానా?" అడిగింది.

"వద్దు. గడ్డం గీసుకుంటూ పాఠం చెబుతాను. సరేనా?"

"సరే."

అద్దం ముందు నించుని, గడ్డం గీసుకుంటూ చెప్పసాగాడు జువాలజీ

పాఠం. తల వంచుకుని వింటూ, పాయింట్స్ వ్రాసుకుంటూంది ఆషా.

"అబ్బా!"

అచ్యుతం కేక విని, తల పైకెత్తి చూసింది ఆషా. చెంపమీద ఉన్న తెల్లటి సబ్బునురుగుమీద ఎర్రటి చారు.

"ఏమయింది?"

"ఏం లేదు. కొంచెం కోసుకుంది."

"అరె! బాగా రక్తం వస్తోందే!"

లేచి అచ్యుతం దగ్గరికి వెళ్ళింది ఆషా, పుస్తకం, పెన్ టేబుల్ మీద వడేసి.

"నొప్పిగా ఉందా?" అడిగింది.

"నథింగ్. ఏం కాదు" అన్నాడు అచ్యుతం నిర్లక్ష్యంగా.

"సారీ. నా మూలంగానే అయింది."

"నెవర్‌మైండ్!"

అప్రయత్నంగా ఆషా అచ్యుతం చెంపమీద చూపుడు వేలుతో ముట్టుకుంది. వెంటనే రక్తం వచ్చే చోట చున్ని (పంజాబీలు గుండెల మీద వేసుకునే అచ్ఛాదన) అంచుతో అచ్యుతం చెంపమీద అద్దింది.

ఆషా చెయ్యి పట్టుకున్నాడు అచ్యుతం, వారిస్తూ. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. ఆషా వెనక్కి ఒక్క అడుగు వేసింది, సిగ్గుగా. మృదువుగా అచ్యుతం చేతిలోని తన చెయ్యి విడిపించుకుంది. వెంటనే వెళ్ళి కుర్చీలో కూర్చుంది.

ఆఫ్టర్ షేవ్ లోషన్ రాసుకున్నాడు అచ్యుతం. రాసుకుంటూ అద్దంలోంచి చూశాడు, టేబుల్ ఎదురుగా కుర్చీలో కూర్చుని ఉన్న ఆషాని.

తల వంచుకుని, చూపుడు వేలుతో టేబిల్‌మీద సున్నాలు గీస్తూంది ఆషా, ఏదో ఆలోచిస్తూ.

చిన్నగా నవ్వుకున్నాడు అచ్యుతం.

## 5


పది రోజులనుంచి బెట్టీ తండ్రికి అచ్యుతమే ఇంజక్షన్స్ ఇస్తున్నాడు. టి. బి. ఆయనకి. రైల్వే హాస్పిటల్లో మందు తీసుకుంటాడు. అదీ టి. బి. కి పూర్తిగా పనికిరాని మందు. స్వంత వైద్యానికి డబ్బు లేదు ఆయన దగ్గర. చాలా భాగం తాగుడుకు ఖర్చు పెట్టేశాడంటారు. ఇప్పుడుకూడా సిగరెట్స్ మానటం లేదు, ఎంత చెప్పినా.

ఆయన సంగతి ఎప్పటి కప్పుడు తనకి పరిచయం ఉన్న ఓ టి. బి. స్పెషలిస్ట్‌కి చెప్పి, సలహాలు తీసుకుని అచ్యుతమే తనకి తోచిన మందు లిస్తున్నాడు. హౌస్ సర్జన్‌కూడాపూర్తి చేయని తన వైద్యం చాలదని తెలుసు అచ్యుతానికి.


72


# మార్గదర్శులు

## కెనడా దాటి వెళ్ళిన మొదటి యూరపియనులు





కెనడా మొదట దాటి వెళ్ళిన వర్గానికి ఫిన్లెండులో జన్మించిన శాస్త్రజ్ఞుడు అడాల్ఫ్ ఎరిక్ నార్డెన్ స్కెల్డ్ నాయకత్వం వహించాడు. అప్పట్లో ఆయన వయసు 36 సంవత్సరాలు.

ఆ వర్గంలో స్వీడెన్, డెన్మార్క్, ఇటలీ, నార్వే దేశాలకు చెందినవారు ఉన్నారు. వారు అట్లాంటిక్ సముద్రం నుంచి ఉత్తర సైబీరియా తీరం వెంబడి తిమింగలాలు పట్టే నౌక వేగాలో పసిఫిక్ మహాసముద్రం చేరుకొన్నారు. ఆవిరితోను, తెరచాపల సహాయంతోను ఆ నౌకను నడిపారు. నార్వేలోని ట్రాంసోలో 1878 జూలై 25 న వారి యానం ప్రారంభమైంది. కొంతదూరం వరకు సరుకుల రవాణా నౌకలు మూడు వారికి తోడుగా వెళ్ళాయి.




ఆగస్టు 19 న ఆసియా భూభాగంలోకెల్లా ఉత్తరపు కొసనున్న ఛెల్యాస్కిన్ అగ్రం చేరారు యాత్రికులు. అంతకుముందు ఎవరూ ఎరగని సముద్ర జలాలలో నౌక మెల్లగా పోతూ ఉండగా నార్డెన్ స్కెల్డ్ శాస్త్రీయ పరిశోధనలు సాగించారు. సైబీరియాకు, అలాస్కాకు మధ్య ఉన్న బేరింగు జలసంధికి నూరు మైళ్ళ దూరం లోపున కలి అఖాతంలో నౌక లంగరు వేయడం సెప్టెంబరు 27 న జరిగింది.



కొంది గంటలలో గమ్యం చేరగలమని యాత్రికులు ఆశించారు. కాని, ఆ రాత్రి నీరు ఘనీభవించింది. నౌక కదలడానికి వీలు లేకుండాపోయింది.

1879 జూలై 18 వరకు వేగా అక్కడ బందీగా ఉండిపోవలసి వచ్చింది. ఆ రోజున మంచు కరగడం ప్రారంభించింది. మరి రెండు రోజులలో వేగా పసిఫిక్ మహాసముద్రంలో ప్రవేశించింది


మిగతా ఇళ్ళలో ఎవరి కయినా పడిశం పట్టినా, జ్వరం వచ్చినా అచ్యుతమే వాళ్ళ ఆహ్వానంమీద వెళ్ళి చూసి, మందు వ్రాసిస్తూంటాడు. ఈ విధంగా చాలామంది ఆడపిల్లల తల్లితండ్రు లందరితో అచ్యుతానికి పరిచయం ఏర్పడిపోయింది నాలుగు నెలల్లోనే.

సాయంత్రం బెట్టీ నాన్నని చూసి గదిలోకి వచ్చాడు అచ్యుతం. ఇప్పుడు సిగరెట్స్ బల్లమీద ఉంచడం లేదు. సులోచన సిగరెట్ డబ్బా కనపడితే తీసి వీథిలో పారేస్తుంది నిర్భయంగా.

*సిగరెట్స్ దాచేందుకు రహస్యమయిన* చోట్లు కనిపెట్టాడు అచ్యుతం. షేవింగ్ బాక్స్ వాటిలో ఒకటి. షేవింగ్ బాక్స్ తెరిచి చూస్తే దానిలో తను దాచిన డబ్బా లేదు. పుస్తకాల వెనకాల చూశాడు. అక్కడా లేదు. కుడికాలి బూటు లోపల చూశాడు. అందులో డబ్బా అలాగే ఉంది.

తలుపు దగ్గరికి వేసి ఒక సిగరెట్ తీసి అంటించి కుర్చీలో కూర్చున్నాడు. టేబిల్‌మీద ఏష్‌ట్రే లేదు. అదీ మాయమయింది.

సులోచన ఆ సమయంలో తన గదికి వస్తుందనుకోలేదు అచ్యుతం. వస్తుందని తెలిస్తే అంత ధైర్యంగా గదిలో సిగరెట్ కాల్చేవాడు కాదు.

చటుక్కున సిగరెట్ ఆర్పేశాడు, సులోచన తలుపు తోసుకుని గదిలోకి రాగానే.

ఎదురుగా వచ్చి, కుర్చీలో కూర్చో లేదు సులోచన. నిలబడే అచ్యుతం చేతిలోని ఆరిపోయిన సిగరెట్ వంక చూస్తూ నిలబడింది.

"ఏం లేదు. . . ఏం తోచకపోతే. . . ఊరికేనే. . . ఒక్కటే. . . ఇంక లేవు."

వేడుకోమన్నట్టుగా చేతులు పైకెత్తాడు. తిడుతుందనుకున్నాడు సులోచన ఏమీ అనలేదు. ఇదివరకులాగా లెంపలు వేసుకోమని చెప్పలేదు ఇదివరకు లాగా. 'ఇంకోసారి సిగరెట్ తాగితే నేను స్కాండల్‌తో సమానం' అని పది సార్లు అనమని చెప్పలేదు.

అలాగే చూస్తూంది అచ్యుతం కళ్లలోకి.

సులోచన మౌనం భరించలేక పోయాడు అచ్యుతం.

"ఇంకెప్పుడూ తాగను."

బల్లకింద ఉన్న బూటులోపల నుంచి సిగరెట్ పెట్టె తీసి టేబుల్ మీద పడేశాడు నిస్సహాయంగా.

"ఈసారి మీరు సిగరెట్ తాగడం చూస్తే నేను ఈ వేలు కోసేసు కుంటాను."

కుడిచేతి చూపుడువేలు ఎత్తి అచ్యుతానికి చూపించింది సులోచన.

"నిజంగా కోసేసుకుంటాను. బాధ అయినా ఫర్వాలేదు. తప్పకుండా కోసేసు కుంటాను."

అచ్యుతం కళ్లలోకి చూస్తూ, దృఢంగా, స్థిరంగా చెప్పింది సులోచన.

ఎప్పుడూ చలాకీగా ఉండే సులోచన అంత గంభీరంగా మాట్లాడటం చూడ లేదు అచ్యుతం.

"ఆ అవకాశం కలగనివ్వను."

అచ్యుతం సిగరెట్ పాకెట్ అందుకుని, కిటికీలోంచి బయటికి విసిరేశాడు.

"నా కోసం చెపుతున్నాను. మీ కోసం కాదు. మీరు బెట్టే తండ్రిలా అయిపోతే ఇక నేను ఎలా బ్రతకగలను?"

కొద్దిగా వణికింది సులోచన కంఠం.

సులోచన కళ్లలోకి చూశాడు అచ్యుతం. అంతకుముందు ఎప్పుడూ చూడని ఆరాధన కనపడింది సులోచన కళ్లలో.

"ఫర్‌గివ్ మి. ఐ ప్రామిస్!" అన్నాడు అచ్యుతం, తల వంచుకుని.

• • •

మెడికల్ జర్నల్ తిరగేస్తూంటే, ఘల్లు ఘల్లుమని గజ్జెల చప్పుడు వినిపించింది. తల ఎత్తి గుమ్మం వంక చూశాడు అచ్యుతం.

స్వాతి.

ఫుల్‌స్లీవ్స్ షర్ట్, బెల్‌బాటమ్స్‌లతో ఉంది స్వాతి, రెండు చేతులూ వెనక్కి పట్టుకుని, ఏదో దాస్తున్నట్టుగా.

"మీ కోసం ఏదో తీసుకు వచ్చాను" అన్నది స్వాతి.

"ఏమిటి?" అడిగాడు అచ్యుతం.

"మీ కిష్టమయింది. కనుక్కోండి."

"ఏమిటి? కనుక్కోలేను" అన్నాడు అచ్యుతం. కాస్సేపు ఆలోచించి.

"నిన్న అడిగారుగా?"

"ఏం అడిగాను?"

"ఇది."

స్వాతి చేతిలో చిన్న సీసా. సీసా నిండా తేనె. స్వాతి దగ్గరికి నడిచి వస్తూంటే కాళ్లకి కట్టుకున్న గజ్జెలు ఘల్లు ఘల్లుమని శబ్దం చేస్తున్నాయి, వినసొంపుగా.

"తేనే? థాంక్స్ ఎ లాట్. మీ నాన్నగారికి తెలుసా?" అడిగాడు అచ్యుతం.

"తెలుసు."

"ఎందుకు తీసుకువచ్చావు?"

"మీ కిష్టం అన్నారుగా?"

"నా కిష్టమయితే తీసుకు రావాలా?"

"అవును."

"ఎందుకు?"

"మీ కిష్టంగా? అందుకే."

[illegible] అచ్యుతాన్ని చూసి సిగ్గు పడింది స్వాతి.

"నా కేది ఇష్టమయితే అది తీసుకు వస్తావా?"

"ఓ. ఇదివరకు తేనెకాక మరోటన్నా మీ కిష్టమన్నారు?"

"నువ్వంటే నా కిష్టం" అన్నాడు అచ్యుతం కొంచెం నవ్వాగి.

"మీ రన్నా నా కిష్టమే!" చెప్పింది స్వాతి.

"దేనికి?"

"మీరు డాక్టర్ గనక. పెద్దయ్యాక నేనూ ఎమ్. బి. బి. ఎస్. చదువుతాను. ఇంకా పైకి చదువుతాను. నాకు చదువు కున్న వాళ్లంటే ఇష్టం. అందరికీ మందు లివ్వచ్చు, బ్రతికించవచ్చు."

"నేను డాక్టర్ కాకపోతే, నే నంటే ఇష్టం ఉండదా నీకు?"

"డాక్టర్ కాకపోయినా మీ రంటే నా కిష్టమే."

"ఏం?"

కళ్లు దించుకుంది స్వాతి. సమాధానం చెప్పలేదు. సిగ్గు అడ్డు వచ్చిందని గ్రహిం చాడు, పదిహేనేళ్లయినా నిండని స్వాతికి.

"థాంక్స్. తేనెకి బదులు ఇది తీసుకో."

తను నాలుగు సంవత్సరాలు కష్టపడి సేకరించిన స్టాంప్స్ ఆల్బమ్ డ్రాయర్ లోంచి తీసి స్వాతికి ఇచ్చాడు.

"వద్దు. అక్కరలేదు."

"ఏం? నువ్వు స్టాంప్స్ సేకరిస్తావుగా?"

"అయినా వద్దు."

"నువ్వు ఆల్బమ్ తీసుకుంటే కోప్పడ తారా ఎవరయినా?"

"కోప్పడరు."

"మరయితే ఎందుకు తీసుకోవు?"

"ఊరికేనే."

"నువ్వు ఆల్బమ్ తీసుకోకపోతే నాకు తేనె సీసా వద్దు."

"అయితే తీసుకుంటాను."

ఆల్బమ్ అందుకుని తెరిచి, అచ్యుతం ఎంతో డబ్బు ఖర్చు చేసి సంపాదించిన స్టాంప్స్‌ని చూడసాగింది ఒక్కొక్కటిగా. చూస్తూ అన్నది:


"పెద్దయ్యాక మనిద్దరం కలిసి విమానం మీద ఈ దేశాలన్నీ చూసి వద్దాం. బెంగుళూరు బాగుంటుంది చాలా. ఇద్దరం కలిసి అక్కడే ఉందాం."

"ఎలా మనం కలిసి ఉండటం?" అన్నాడు అచ్యుతం, అర్థం కాక.

"ఎలా ఏమిటి? మనకి పెళ్లయి పోతుందిగా అప్పటికి?"

ఈమాత్రం తెలియదా అన్నట్టుగా చూసింది స్వాతి. అందరూ సిగ్గు పడ్డట్టుగా సిగ్గు పడలేదు స్వాతి, పెళ్లి గురించి మాట్లాడేందుకు. చాలా మామూలుగా చెప్పింది.


(సశేషం)



నవరాత్రి సందర్భంలో బొమ్మల ప్రదర్శనంలో మద్రాసులోని ఖాదీ గ్రామోద్యోగ భవన్‌లో సెప్టెంబరు 22 న ప్రారంభించిన దృశ్యం. రాష్ట్రపతి అవార్డు పొందిన నిపుణులు రూపొందించినవి కూడా ఉన్నాయి.

# అద్దెకిచ్చిన హృదయాలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి



(క్రిందటి సంచిక తరువాయి)

**6**

చిత్రకి టైఫాయిడ్. వారం రోజులుగా అచ్యుతమే వెళ్లి చూస్తున్నాడు చిత్రని. మందులు స్వయంగా తనే కొనుక్కు వచ్చి ఇస్తున్నాడు. ఉదయం, సాయంత్రం టెంపరేచర్, పల్స్ తీసుకుని శ్రద్ధగా చూస్తున్నాడు.

పది రోజుల తరవాత బాగా ఎక్కువయింది జ్వరం. అచ్యుతం రాత్రంతా అక్కడే ఉన్నాడు, అరగంటకీ అరగంటకీ టెంపరేచర్ చూస్తూ. మందు స్వయంగా తాగించడం, నుదురుమీద యూడీ కొలోన్ పట్టీ ఆరగానే తడిపి వేయటం, దాహమయినప్పుడు గ్లూకోజ్ నీళ్ళు అందించడం మొదలయిన పనులన్నీ తనే చేయసాగాడు.

జ్వరం వల్ల ఆహారం సరిగా తీసుకోకపోవడం వల్ల బాగా నీరసించి పోయింది చిత్ర. పిచ్చి పిచ్చి పలవరింతలు ప్రారంభం అయాయి, రాత్రి పదకొండు గంటలకి.

చిత్ర దగ్గరినుంచి కదలకుండా కూర్చోవడానికి కారణం, పక్కనే కూర్చుని చూడాలని కాదు. అచ్యుతాన్ని చిత్ర

కదలనిచ్చేవాడు తన దగ్గర నుంచి. అచ్యుతం వంక చూస్తూ పడుకునేది. చిత్ర కొద్దిగా కునుకు తీస్తే బయటికి వెళ్ళేవాడు అచ్యుతం.

స్వాతి వచ్చి చెప్పేది అచ్యుతానికి: "అక్కకి మెలకువ వచ్చింది. పిలుస్తోంది."

"ప్లీజ్. నా దగ్గరనుంచి వెళ్లకండి నాకు నయమయిపోయేదాకా" అనేది చిత్ర, అచ్యుతం రాగానే.

స్వయంగా బత్తాయి రసం తీసి ఇస్తున్న అచ్యుతంతో అనేది చిత్ర: "థాంక్స్. ఈసారి మీకు జ్వరం వచ్చినప్పుడు నాకు తెలియపరచండి. మీకు సేవచేసి బదులు తీర్చుకుంటాను."

పదకొండున్నర ప్రాంతంలో చిత్ర మామూలు స్థితికి వచ్చింది, అచ్యుతం ఇంజక్షన్ ఇవ్వగానే.

అచ్యుతం కళ్లలోకి చూస్తూ అన్నది చిత్ర, అచ్యుతం చేతులు పట్టుకుని: "నేను మళ్లీ కోలుకుంటానా?"

"తప్పకుండా."

"చచ్చిపోతా ననిపిస్తోంది."

"ఛీ. తప్పకుండా లేచి తిరుగుతావు."

"చచ్చిపోతానని తెలుస్తే చెప్పేయండి. మనిద్దరం పెళ్లి చేసుకుందాం. తరవాత నేను చచ్చిపోయినా ఫర్వాలేదు."

చిత్ర కళ్లలోకి చూస్తూండి పోయాడు అచ్యుతం, కొంచెం ఆశ్చర్యంగా. ఇలా మాట్లాడుతుందనుకోలేదు ఎప్పుడూ. చిత్రకి సిగ్గు ఎక్కువ. చిత్ర తనని ప్రేమిస్తోందని గ్రహించగలిగాడు అచ్యుతం. కాని, సిగ్గు అడ్డు రావడం వల్ల తనకి చెప్పలేక పోతూందని అనుకున్నాడు.

జ్వర తీవ్రతలో చెపుతుందనుకోలేదు. జ్వరం తగ్గాక చెపుతుందనుకున్నాడు. తనంటే సిగ్గు పోయేందుకు ప్రయత్నించాడు అచ్యుతం, దొరికిన ఈ కాస్త అవకాశంతో. మిగతా పిల్లల లాగా చిత్ర చనువుగా రాదు అచ్యుతం గదికి. సిగ్గు, వయసు అడ్డు వస్తాయి. మిగతా వాళ్ళు ఇంకా చిన్న పిల్లల కిందే లెక్క. స్త్రీత్వం పూర్తిగా ప్రవేశించింది పందొమ్మిదేళ్ల చిత్రలో.

"నేను చచ్చిపోనుగా?" అడిగింది చిత్ర.

తల అడ్డంగా ఊపాడు అచ్యుతం నవ్వుతూ.

"నన్ను తప్పకుండా పెళ్లి చేసుకొంటారుగా?"

తల ఊపాడు మళ్లీ.

"ఐ లవ్ యు."

కళ్లు మూసుకుంది చిత్ర. యూడి కొలోన్ పట్టీ తీసి, తడిపి మళ్లీ నుదుటి మీద వేశాడు అచ్యుతం.

మామూలుగా ఉంటే చిత్ర ఇంత ధైర్యంగా చెప్పేది కాదు తనని ప్రేమిస్తున్నట్టుగా. తను చేస్తున్న సహాయం వల్ల కలిగిన కృతజ్ఞతా భావంతో, జ్వర తీవ్రత వల్ల కలిగిన పరిణామంతో అడగ గలిగింది పెళ్లి చేసుకుంటారా అని.

వారం రోజుల తరవాత నయమయింది చిత్రకి పూర్తిగా. రోజు విడిచి రోజు అచ్యుతం విటమిన్ బి కాంప్లెక్స్ విత్ లివర్ ఎక్స్ట్రాక్ట్స్ ఇంజక్షన్స్ ఇస్తున్నాడు చిత్రకి, బలం కోసం. తనకు తెలిసిన రిప్రజెంటెటివ్స్ నుంచి ఉచితంగా తీసుకువచ్చాడు చాలా భాగం మందులు.

"మీ మేలు నిజంగా మరిచిపోలేము. డాక్టర్‌కూడా ఎంత డబ్బిచ్చినా ఇంత శ్రద్ధగా చూసేవాడు కాడు" అన్నారు బిజినెస్ టూర్‌నుంచి తిరిగి వచ్చిన చిత్ర నాన్న, సంగతులు తెలుసుకుని.

"నా దేం లేదు." సిగ్గు పడ్డాడు అచ్యుతం.

అచ్యుతం వంక అభిమానంగా చూస్తూ అన్నాడు ఆయన: "ముందు మీ సంగతి మాకు సరిగా తెలియదు. మీకు గది అద్దెకు ఇచ్చారని తెలియగానే ఇక్కడ ఉంటున్న మా కందరికీ నిజంగా కోపం వచ్చింది. మీరు చూస్తూనే ఉన్నారుగా— అంతా ఆడపిల్లల మయం ఇక్కడ. మేమంతా కలిసి ఈ ఇంటి యజమానికి ఓ ఉత్తరం వ్రాసివేశాం, మిమ్మల్ని ఖాళీ చేయిస్తేగాని ఈ ఇంట్లో ఉండలేమని. మా ఉత్తరానికి సమాధానం లేదు. మీ నడవడి, మంచి చూశాక మా ప్రయత్నం విరమించుకున్నాం. అందులో అందరికీ సహాయకారిగా ఉంటున్నారు మీరు."

చిన్నగా నవ్వాడు అచ్యుతం సమాధానంగా.

"అమ్మాయిలంతా మీకు మంచి స్నేహితు లయిపోయినట్లున్నారు. మీరు మాకు బాగా నచ్చారు కాబట్టి మీతో మాట్లాడటానికి ఎవరూ ఎట్టి అభ్యంతరం చెప్పటం లేదు."

"థాంక్యూ ఫర్ ది గుడ్ ఒపీనియన్" అన్నాడు అచ్యుతం.

"స్వాతి చెప్పింది మీకు తేనె అంటే ఇష్టమని. మా దగ్గరున్న తేనె అయిపోగానే మొహమాట పడకుండా ఇంకో సీసా అడిగి తీసుకోండి."

"అలాగే" అన్నాడు అచ్యుతం నవ్వి.

నిద్రలో ఉన్న అచ్యుతానికి మెలకువ వచ్చింది. గబగబ తలుపు కొడుతున్న చప్పుడు వినపడుతూంది.

లేచి తలుపు తెరిచాడు అచ్యుతం. ఎదురుగా బెట్టీ.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాడు అచ్యుతం, బెట్టీ మొహంలోని ఖంగారు గుర్తించి.

"త్వరగా రండి. మా నాన్నగారు. . ."

చేతి గడియారం వంక చూసుకున్నాడు. పన్నెండూ ముప్పయి అయిదు.

మెడిసిన్ ఛెస్ట్ అందుకుని బెట్టీ వెనక పరుగెత్తాడు అచ్యుతం, చెప్పులు తొడుక్కుని. ముందు గదిలో పడక కుర్చీలో పడుకుని ఉన్నాడు బెట్టీ నాన్న. ఏభై పైనే ఉంటాయి. తెల్లగా ఉన్న పలచటి జుట్టు మెరుస్తూంది. తేనె రంగు కళ్లు. కూతురుకి తండ్రి ద్వారానే సంక్రమించి ఉండచ్చు అనుకున్నాడు ఆ అందమయిన తేనెరంగు కళ్లు.

"ఏమయింది?" అడిగాడు బాగా ఆయాసపడుతున్న ఆయన నాడి చూస్తూ.

"ఎక్కువయినట్లుంది. దగ్గు బాగా వస్తోంది."

ఎదురుగుండా బేసిన్‌లో రక్తం కక్కుకున్నట్లున్నాడు. అయిదు నిమిషాలు పరీక్షించి, ఓ ఇంజెక్షన్ ఇచ్చాడు.

"ఇప్పుడే వస్తాను" అని బయటికి వచ్చి, దగ్గరే ఉన్న ఓ ఇరానీ రెస్టారెంట్ లోంచి తనకి తెలిసిన టి. బి. స్పెషలిస్ట్ ఇంటికి ఫోన్ చేసి, పరిస్థితి చెప్పి, ఏం చేయాలో అడిగాడు. డాక్టర్ ఫోన్‌లో ఇచ్చిన సూచనలు వ్రాసుకున్నాడు, జాగ్రత్తగా.

తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి ఆయాసం ఇంకా ఎక్కువయింది. దగ్గుతున్నాడు విపరీతంగా.

"ఇది డబ్బున్న వాళ్లకు వచ్చే రోగం. నా లాంటి వాళ్లకి వస్తే ఇంతే" అన్నాడు అచ్యుతం వంక జాలిగా చూస్తూ.

"అధైర్య పడకండి" అన్నాడు అచ్యుతం, ఇంజెక్షన్ ఇస్తూ.

"క్రీస్తుకి బుద్ధి లేదు." గొణిగింది బెట్టీ.

రెండు గంటల దాకా బెట్టీ వాళ్లింట్లోనే ఉన్నాడు అచ్యుతం, పక్క వాటాలలో వాళ్ళు వెళ్లిపోయినా. బెట్టీకి తోడుగా చిత్ర, సులోచనా ఉన్నారు.

రెండూ అయిదుకి వెళుతూ మళ్లీ పరీక్ష చేశాడు, పడక కుర్చీలో పడుకుని ఉన్న బెట్టీ తండ్రిని.

అప్పటికే అంతా మించిపోయింది.

బెట్టీ నాన్న చనిపోయి చాలా సేపయింది.



దేవి    ఫోటో—కె. వి. రావు (మద్రాసు-64)

ఏడుపులు విని అంతా మళ్ళీ లేచి వచ్చారు. బెట్టీ తండ్రి పక్కన పడి ఉన్న సిగరెట్ పాకెట్‌లోంచి సిగరెట్ తీసి ముట్టించి, అచేతనంగా పడి ఉన్న బెట్టీ తండ్రి వంక చూశాడు అచ్యుతం బాధగా. బ్రతికి ఉన్నప్పుడు బాధ పెట్టే రోగాలలో టి. బి. ఒకటి.

అచ్యుతం చేతిలోని సిగరెట్‌ని లాగేయాలనే ఆలోచనే రాలేదు సులోచనకి.

మొదటిసారిగా అచ్యుతం కళ్ళలో నీళ్ళు చూశారు, ఈ తొమ్మిది నెలల్లో, ఆ ఆరుగురు ఆడపిల్లలు.

అచ్యుతం ఏడిచింది బెట్టీ నాన్న కోసం కాదు, బియాట్రైస్ భవిష్యత్తు తలుచుకుని.

## 7

**అచ్యుతం బెట్టీ కుటుంబానికి బాగా సహాయపడ్డాడు. వారం రోజులు ఆస్పత్రి మానేసి బెట్టీ కుటుంబం కోసం తిరిగాడు—బెట్టీ నాన్న ఇన్స్యూరెన్స్ విషయంలో, ప్రావిడెంట్ ఫండ్ విషయంలో, పెన్షన్ విషయంలోనూ.**

బెట్టీ నాన్న శవాన్ని గ్రేవ్‌యార్డ్‌కి చేర్చడంనుంచి, ఇన్స్యూరెన్స్ నుంచి వచ్చిన చెక్కు బాంక్‌లో జమ కట్టేదాకా బాగా సహాయపడ్డాడు.

నెలలు గడిచిన కొద్దీ అచ్యుతానికీ, ఆడపిల్లలకీ మధ్య దూరం దూరమయి, మనసులు దగ్గరయాయి. సాయంత్రం ఆస్పత్రి నుంచి ఇంటికే వచ్చేస్తున్నాడు. అచ్యుతం కోసం అంతా ఎదురు చూస్తూంటారు.

చీకటి పడుతూండగా అచ్యుతం వాకింగ్ వెళ్ళే అలవాటుని ఆ అయిదుగురు పట్టు పట్టి మానిపించారు బలవంతంగా. ఎప్పుడయినా వెళ్ళినా, అంతా కలిసే వెళతారు.

ఆరుబయట సిమెంట్ బెంచీమీద కూర్చుంటారు అయిదుగురూ. ఎదురుగా గోడకి ఆనుకుని వాళ్ళ వంక చూస్తూ, నిలుచుని కబుర్లు చెపుతాడు అచ్యుతం. అనేక విషయాలు మాట్లాడుకుంటారు. సినిమాలు, పాటలు, ఫాషన్లు, రాజకీయాలు, హాస్పిటల్ విషయాలు, కాలేజీలో అనుభవాలు, వివిధ రకాల పేషెంటూ, వాళ్ళ రోగాలు— అన్ని సంగతులూ.

వీలయినంతవరకు అందరితో సమానంగా మాట్లాడతాడు అచ్యుతం ఏ ఒక్కరితో నయినా ఎక్కువ మాట్లాడితే మిగతా వాళ్ళకి కోపం వస్తుంది. సులోచన అందరిలోకి చురుకయినది ఏమాత్రం తొణుకు, బెణుకు లేదు ఏ విషయంలోనైనా. చిత్రకి, స్వాతికి సిగ్గు ఎక్కువ. తక్కువ మాట్లాడతారు. కాని, అచ్యుతం చెప్పేది శ్రద్ధగా వింటారు.

ఆషాకి కొత్తలో ఉన్న సిగ్గు, భయం ఇప్పుడు లేవు. అచ్యుతాన్ని ఏడిపించాలని చూస్తుంది ఎప్పుడూ, సులోచనతో కలిసి.

బెట్టీ ఎంత చిలిపిదయినా, పెద్ద మనిషి తరహాగా ఉంటుంది. ఆలోచించి మాట్లాడుతుంది ఏదయినా.

వసతి తల్లి భయం వల్ల వసంత ఎక్కువగా మాట్లాడదు. సాయంత్రం వాళ్ళతో ఎక్కువగా చేరదు. ఏ కిటికీ లోంచో, తలుపు చాటునుంచో నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళవంక చూస్తూంటుంది.

పది నెలల్లో పదిహేను సార్లు కంటె ఎక్కువ మాట్లాడలేకపోయాడు అచ్యుతం, అదీకూడా వసంత వసతి తల్లికి తెలియకుండా. అచ్యుతంతో మాట్లాడుతున్నంత సేపు వసంత కళ్ళలో ఉత్సాహం, కొత్త వెలుగు తొంగి చూస్తాయి.

స్వభావాలు వేరయినా, అందరిలోనూ ఒక్కటే సిమిలారిటీ— అందరికీ అచ్యుతం అంటే తగని ప్రాణం; గుడ్డి ఆరాధన.

* * *

గదిలో కూర్చుని ఫిజియాలజీ పుస్తకం తిరగేస్తూంటే చిత్ర వచ్చింది అచ్యుతం గదిలోకి.

"హలో! రండి. మీరు చాలా తక్కువ సార్లు వచ్చారు ఇక్కడికి" అన్నాడు అచ్యుతం, చిత్రని చూసి పుస్తకం మూసి నిలబడి.

"రేపు నా పుట్టినరోజు." చెప్పింది చిత్ర, కూర్చున్న తరవాత.

"గ్లాడ్. జ్వరం నుంచి పూర్తిగా కోలుకున్నట్లున్నారు. అయినా, నీరసంగానే కనపడుతున్నారు."

"ఇప్పుడు పూర్తిగా కులాసా. రేపు ఉదయం మా ఇంటికి భోజనానికి రావాలి మీరు తప్పకుండా."

"పుట్టినరోజుకా?"

"అవును. ఎవరినీ పిలవటం లేదు. మిమ్మల్నొక్కరినే."

"థాంక్స్. తప్పకుండా వస్తాను."

"మా నాన్నగారు మళ్ళీ వచ్చి పిలుస్తారు మిమ్మల్ని. బహుశా మరిచిపోయినా తప్పకుండా రావాలి."

"అలాగే."

కొన్ని క్షణాలాగి అంది చిత్ర: "నాకు సంబంధాలు వెతుకుతున్నారు అమ్మా, నాన్నా."

చిత్ర వంక చూశాడు అచ్యుతం. సిగ్గుతో ఎర్రబడ్డాయి బుగ్గలు.

"అయితే మనం ఓ నిర్ణయానికి రావడం మంచిది త్వరగా."

"అవును" అన్నది, సిగ్గుతో తల వంచుకుని.

"ఇంకో నెల రోజుల్లో నా కోర్సు కూడా పూర్తయిపోతుంది."

"మా నాన్నగారితో మాట్లాడండి మరి."

"తప్పకుండా. సమయం చూసి చెపుతాను."

"రేపు ఉదయం తప్పకుండా రావాలి మీరు."

చిత్ర వెళ్ళిపోయినా ఫిజియాలజీ పుస్తకం అందుకోలేదు అచ్యుతం. అలాగే కూర్చుని ఆలోచిస్తూండిపోయాడు. సులోచనకి మాట ఇచ్చిన తరవాత రెండో సారి సిగరెట్ ముట్టించాడు అచ్యుతం.

మరునాడు ఉదయం చిత్ర వాళ్ళింటికి భోజనానికి వెళ్ళాడు అచ్యుతం. బిసిబేళ హూళియన్న, ఉప్పిట్టు— ఇంకా చాలా కన్నడం వంటలు రుచి చూపించారు అచ్యుతానికి.

స్వాతి చెప్పింది వడ్డిస్తూ. అవి సాధారణంగా అన్నంలో వడ్డించేందుకు చేయరు. విడిగా చేసుకుని తింటారు. అచ్యుతం కోసం చిత్ర చేసింది.

కన్నడం వంట కాకపోయినా, 'అవియలు' బాగా వచ్చింది అచ్యుతానికి.

ఆ రోజు సాయంత్రం వచ్చింది సులోచన, ఆషాతో.

"చిత్ర ఇంటికి ఉదయం భోజనానికి వెళ్ళారుటగా?" అడిగింది ఆషా.

"అవును." చెప్పాడు అచ్యుతం.

'అయితే, మా ఇంటికి రండి రేపు."

"దేనికి?"

"చిత్ర ఇంటికి దేనికి వెళ్ళారు?"

"చిత్ర పుట్టిన రోజు ఈవేళ.'



ఇటీవల బళ్ళారి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన ఇచ్చిన కుమారి విజయలక్ష్మి

"అయితే నా పుట్టిన రోజు రేపు."

"కాదు. నా పుట్టిన రోజు రేపు. మా ఇంటికి రండి రేపు" అన్నది సులోచన.

"కాదు. నీ పుట్టిన రోజు ఎల్లుండి. రేపు మా ఇంటికి వస్తారు మాస్టారు."

"అబద్ధం ఆడకు. నాది రేపు. నీదే. ఎల్లుండి."

"కాదు. నాది."

"నాది."

"ష్. పోట్లాడకండి. పొద్దున్న ఒకళ్లింటికి, రాత్రి మరొకరింటికి వస్తాను."

"రాత్రి సులోచన ఇంటికి. పొద్దున్న మా ఇంటికి" అన్నది ఆశ.

"కాదు. ఉదయమే మా ఇంటికి" అన్నది సులోచన, ఆశ వంక కచ్చెంపుగా చూస్తూ.

"ఉదయం ఆశ ఇంటికి. రాత్రి సులోచన ఇంటికి."

"బాగా అయింది" అన్నది ఆశ చప్పట్లు కొట్టి, సులోచన వంక ఎగతాళిగా చూస్తూ.

"కాని, రేపు కాదు."

"ఎప్పుడు మరి?" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"తరవాత చెపుతా..."

"ఎల్లుండా?"

"కాదు. నేను వెళ్లి పోయే లోపల."

సులోచన, ఆశ ఒకరి వంక ఒకరు చూసుకున్నారు, అర్థం కానట్లుగా.

"ఎప్పుడు?" అడిగారు మళ్లీ.

"నేను వెళ్లిపోయే లోపల."

"ఎప్పుడు మీరు వెళ్లిపోయేది?"

"ఇంకో నెల రోజుల్లో."

"ఎక్కడికి?"

"ఏమో? ఇంకా ఆలోచించలేదు."

"దేనికి వెళ్లిపోవటం?"

"దేనికేమిటి? నా కోర్సు పూర్తయి పోతుంది."

దిగులుగా చూశారు ఇద్దరూ.

"వెళ్లకండి. ఇక్కడే ఉండిపోండి" అన్నది ఆశ దీనంగా.

"వెళ్లనిస్తే మేమిటి? ఎలా వెళతారో చూస్తాముగా" అన్నది సులోచన బెదిరింపుగా.

కొంచెంసేపు మౌనంగా ఉండి అడిగాడు అచ్యుతం ఇద్దరి వంక చూస్తూ: "నేను వెళ్లిపోతే మీరు బాధ పడతారా?"

"అవును. మీరు వెళ్లకూడదు" అన్నారు ఇద్దరూ.

గుమ్మం దగ్గరికి వెళ్లాడు అచ్యుతం. వసంత చీపురుతో ఊడుస్తోంది నేల వసంతని ఎప్పుడు చూసినా జాలి ముంచుకు వస్తుంది అచ్యుతానికి. వసంత సవతి తల్లిమీద గొంతు దాకా కోపం. కాని, ఏం చెయ్యలేడు. ఏం చెయ్యాలో కూడా తెలియదు.

వసంత ఇంటికికూడా వెళ్లాలి వెళ్లేలోపుగా అనుకున్నాడు మనసులోనే. వెనక్కి తిరిగి చూశాడు అచ్యుతం.

ఆశ, సులోచన నిశ్శబ్దంగా పెన్నుతో అచ్యుతం కూర్చునే కుర్చీమీద ఇంకు చల్లుతున్నారు. వాళ్లిద్దరు చేరితే అల్లరి తప్పదు. వాళ్ల అల్లరికి అలవాటు పడ్డ అచ్యుతానికి వాళ్లు అల్లరి చేయకపోతే తోచదు.

చూడనట్లుగా వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు అచ్యుతం. ముసిముసిగా తమలో తాము నవ్వుకుంటూ చేతులు పట్టుకుని బయటికి వెళ్లారు ఇద్దరూ. బెట్టినికూడా పిలుచుకువచ్చి, అల్లరి చేసేందుకు అనుకున్నాడు అచ్యుతం.

చిన్నగా నవ్వుకున్నాడు వాళ్ల పసి మనస్తత్వాలకి.

(సశేషం)




## ట్రెపీజ్ ఉపయోగించిన తొలి మానవుడు

ట్రెపీజ్ ఉపయోగించిన మొదటి మనిషి ఫ్రెంచివాడు జూల్స్ లియొటర్డ్. 1859 లో అతడు ట్రెపీజ్ ఉపయోగించాడు. లియొటర్డ్ తండ్రి టూలూజ్ లో ఒక వ్యాయామశాలను, స్విమ్మింగ్ పూల్ (ఈతకొలను)ను నిర్వహించేవాడు. అక్కడే ట్రెపీజ్ పుట్టింది.

లియొటర్డ్ యువకుడు. ప్రతిభావంతుడైన 'ఏక్రొబాట్'. వ్యాయామశాల పైకప్పు నుంచి వెలుతురు కోసం వేలాడదీసే తాళ్ళను ఊయలగా ఉపయోగించి గాలిలో వ్యాయామవిద్య ప్రదర్శించడం సాధ్యమని అతడు గుర్తించాడు. అంతగా ప్రమాదం సంభవిస్తే క్రిందనున్న ఈతకొలనులో పడి తడవడం మినహా మరే అపాయమూ ఉండదు.

శీఘ్రంగానే లియొటర్డ్ తన అభిప్రాయానికి కార్యరూపం కల్పించి, అభ్యాసంతో ప్రావీణ్యం గడించి, ప్రదర్శనం ఇవ్వడానికి సంసిద్ధుడయ్యాడు. 21 సంవత్సరాల ప్రాయంలో అతడు ట్రెపీజ్ మీద ఇచ్చిన వ్యాయామ విద్యాప్రదర్శనం పారిస్‌లో వేలాది ప్రజల ప్రశంసల నందుకొన్నది. అయితే, అతడు ప్రదర్శనా లిచ్చిన హాల్సులో దిగువ ఈతకొలనులు లేవు. క్రింద పడితే పరలోకానికి ప్రయాణం కావలసిందే. అయితేనేమి? లియొటర్డ్‌కు ధైర్యం ఉంది. అందుకు వలసిన ప్రావీణ్యం ఉంది.

విధివైచిత్ర్యం ఏమంటే 11 సంవత్సరాలపాటు ప్రతి రాత్రీ మృత్యువును ప్రతిఘటించి గాలిలో వ్యాయామవిద్య ప్రదర్శించిన ఈ సాహసికుడు స్పెయిన్‌లో పర్యటిస్తూ ఉండగా మశూచి సోకి ప్రాణం కోల్పోయాడు.

నేటికీ ట్రెపీజ్ వ్యాయామవిద్యా ప్రవీణులు, నాట్యవిద్యా విశారదులు, మల్లులు ధరించే బిగుతైన దుస్తులకు లియొటర్డ్ పేరు ఉంది.

# అద్దెకొచ్చిన హృదయాలు

(క్రిందటి సంచిక తరువాయి)

8

మల్లాది వెంకట కృష్ణమూర్తి

అచ్యుతం చెప్పింది శ్రద్ధగా విన్నాడు ఆ ముసలాయన.

"ఇదీ సమస్య. ఇప్పుడు నే నేం చేయాలి?" అడిగాడు అచ్యుతం, భారంగా ఆయన ముఖంలోకి చూస్తూ.

"మీది చాలా వింత సమస్య" అన్నాడు ఆ ముసలాయన నవ్వి.

"అవును. నాకు తెలియకుండానే, నా అంతట నేనే ఇరుక్కున్నాను దీనిలో. ఇలా అవుతుందని తెలిస్తే ముందరే ఎవరికీ చనువు ఇవ్వకుండా జాగ్రత్తపడే వాడిని."

"ఏం చేద్దామనుకొంటున్నారు ఇప్పుడు?"

"అది మీరు చెప్పాలి ఆలోచించి. మనుషుల సైకాలజీ గురించి మీకు బాగా తెలుసు. ఎవరి మనసూ బాధ పడకుండా ఉండాలంటే నే నేం చేయాలో మీరు చెప్పాలి."

"మీరు వారం రోజుల్లో తప్పకుండా వెళ్ళిపోవాలి గదా ఆ గదిలోంచి?"

"అవును."

"ఈ సమస్య మీరు ముందరే గుర్తించి నా దగ్గరికి వస్తే బాగుండేది. ఇంత స్వల్ప వ్యవధిలో. . ."

"దయచేసి ఆలోచించండి. నేను మళ్ళీ వస్తాను."

"ఆల్ రైట్. కాని, ఎవరి మనసూ బాధపడకుండా మీరు బయట పడలేరు."

అచ్యుతం నీరసంగా లేచి బయటికి వచ్చాడు. గేటు దాటి బయటికి వచ్చి, గేటుకి వేలాడుతున్న బోర్డుమీద వ్రాసిన పేరు కింద అక్షరాలు చదివాడు. "ప్రొఫెసర్ ఆఫ్ సైకాలజీ, ఉస్మానియా యూనివర్సిటీ."

• •

చాలా ఆలస్యంగా వచ్చాడు అచ్యుతం ఆ రోజు గదికి. దూరంనుంచే గమనిం వాడు, తన కోసం బయట నిలబడి ఎదురుచూస్తున్న ఆ అయిదుగురు అమ్మాయిలనీ.

"దేనికీ ఆలస్యం అయింది?" అడిగింది సులోచన.

"యూనివర్సిటీలో పనిచేసే ఓ ప్రొఫెసర్ని కలుసుకోవడానికి వెళ్ళాను." చెప్పాడు అచ్యుతం.

"ఏ ప్రొఫెసర్?" అడిగింది స్వాతి.

"సైకాలజీ. ఇది రెండవ సారి ఆయన్ని కలుసుకోవటం."

"దేనికి?" అడిగింది బెట్టీ.

"చిన్న సైకలాజికల్ ప్రాబ్లమ్."

"ఏమిటది?" అడిగింది చిత్ర.

"నథింగ్ మచ్ ఆఫ్ ఇంపార్టెన్స్."

"సినిమాకి వెళ్ళిఉంటారనుకున్నాను" అన్నది ఆషా.

"వెళ్ళేటట్లయితే ముందే చెప్పి వెళ్ళే వాడినిగా" అన్నాడు అచ్యుతం నవ్వి.

బాగా మేఘాలు ఆవరించుకుని ఉన్నాయి ఆకాశం నిండా. చలిగాలి వీస్తోంది బాగా. వర్షం పడే సూచన లున్నాయి. ఆగి ఆగి మెరుపులు మెరుస్తున్నాయి.

"రేపు మీ రంతా నాతో రావాలి" అన్నాడు అచ్యుతం.

"ఎక్కడికి?"

"చిన్న కల్చరల్ ప్రోగ్రామ్."

"ఏం ప్రోగ్రామ్?"

"లైట్ మ్యూజిక్."

"ఎంత టిక్కెట్?" అడిగింది బెట్టీ.

"టిక్కెట్ లేదు మీకు. మా మెడికోస్ క్లబ్ నిర్వహిస్తోంది ఈ ప్రోగ్రామ్ని."

"దేనికి?"

ఎందుకో చెప్పలేదు అచ్యుతం, ముందరే చెప్పటం ఇష్టం లేక.

"ఎన్ని గంటలకి?"

"అయిదున్నరకల్లా తయారుగా ఉండాలి అంతా."

"ఓ కే" అన్నది బెట్టీ ఉత్సాహంగా.

"వసంతకూడా వస్తుంది మనతో."

"నిజంగా? వాళ్ళమ్మ ఊరుకుంటుందా?"

"ఆ సంగతి నేను చూసుకుంటాను."

అచ్యుతంలో మార్పుని గమనించింది అందరికన్నా పెద్దదయిన చిత్ర. ఎప్పటి మాదిరిగా లేదు అచ్యుతం మొహం ఉత్సాహంగా. దిగులుగా వాడిపోయి ఉంది.

గదిలోకి వెళ్ళి మొహం కడుక్కుని, బట్టలు మార్చుకున్నాడు అచ్యుతం. తల దువ్వుకుని బయటికి వచ్చాడు. మెరుపులు మెరవడం ఎక్కువయింది. చల్లగాలి ఇంకా ఎక్కువయింది.

సరాసరి వసంత ఇంట్లోకి, 'ఇ' బ్లాక్లోకి వెళ్ళాడు అచ్యుతం. అదే అచ్యుతం ఈ సంవత్సరంలో మొదటిసారి ఆ వాటాలోకి వెళ్ళడం.

ముందు గదిలో పేపర్ చదువుకొంటూ పడుకొని ఉన్నాడు ఏభై ఏళ్లాయన, పడక కుర్చీలో.

"నమస్తే. నా పేరు అచ్యుతం" అన్నాడు.

అచ్యుతం వంక ఎగాదిగా చూశాడు ఆయన.

"నేను ఇక్కడే అద్దెకి ఉంటున్నాను. నన్ను చాలాసార్లు చూసి ఉంటారు మీరు."

"అవును. కూర్చోండి."

"ఫర్వాలేదు. చిన్న సహాయం కావలసి వచ్చాను."

"అడగండి."

"సంవత్సరంనుంచి ఇక్కడ ఉంటున్నాను. నన్ను చూస్తూనే ఉన్నారు మీరు. నా మంచితనం మీద నమ్మకం ఉందా?"

సమాధానం చెప్పలేదు ఆయన. ప్రశ్నార్థకంగా చూశాడు అచ్యుతం మొహంలోకి.

"మా మెడికోస్ క్లబ్ రేపు సాయంత్రం చిన్న ప్రోగ్రామ్ ఏర్పాటు చేసింది. మీ కభ్యంతరం లేకపోతే. . ."

"చందా? ఎంత?" అడిగాడు దర్పంగా.

"డబ్బు కోసం రాలేదు నేను."

"మరేం కావాలి?"

"వసంతని నాతో ప్రోగ్రామ్కి పంపాలి."

తెల్లబోయి చూశాడు ఆయన అచ్యుతం వంక, నమ్మలేనట్లుగా.

"అవును. రేపు వసంతని దయచేసి నాతో పంపండి. ప్రోగ్రామ్ అవగానే తీసుకువస్తాను."

మాట్లాడలేదు ఆయన. అచ్యుతం వంక చూస్తూండిపోయాడు.

"నేను ఒక్కడినే వెళ్ళటం లేదు. మీ కా భయం అక్కరలేదు. మిగతా అయిదుగురూకూడా వస్తున్నారు నాతో."

"దేనికీ వసంతకూడా?"

"ఊరికేనే. మిగతా వాళ్ళందరినీ తీసుకువెళ్ళి వసంతని వదిలేయటం నా కిష్టం లేదు."

"అది రాదు. దాన్ని ప్రతి అడ్డమయిన వెధవ వెంటా పంపము."

లోపలనుంచి వసంత నవతి తల్లి గొంతు వినపడింది గట్టిగా.

"ప్లీజ్. మై ఓన్లీ రిక్వెస్ట్" అన్నాడు అచ్యుతం, ఆ మాటలు వినపడనట్లుగానే.

"పంపద్దు." లోపలనుంచి మళ్ళీ.

"ఇంక రెండు మూడు రోజుల్లో వెళ్లిపోతున్నాను. వసంతని నాతో పంపడం వల్ల ఎలాంటి నష్టం జరగదని మీకు హామీ వ్రాసిస్తాను కావాలంటే" అన్నాడు అచ్యుతం, కొంచెం దీనంగా.

"అరె! పంపమంటే?" అరిచింది వసంత సవతి తల్లి, బయటికి వచ్చి అచ్యుతాన్ని మింగేలా చూస్తూ.

కొన్ని క్షణాలు అచ్యుతం వంకా, భార్య వంకా చూశాడు ఆ ముసలాయన. వసంతని తనంతట తాను ఎన్నడూ డబ్బు ఖర్చు పెట్టి సినిమాకైనా పంప లేదు. వసంతకి అచ్యుతం అంటే ఇష్ట మనికూడా తెలుసు ఆయనకి. అచ్యుతం వెళ్లిపోతే ఇంక వసంత మళ్లీ కలవక పోవచ్చు జీవితంలో.

కొంచెంసేపు ఆగి అన్నాడు ఆయన: "ఆల్‌రైట్. రేపు మీతో వస్తుంది."

"థాంక్స్ ఎ లాట్. రేపు అయిదున్నర కల్లా సిద్ధంగా ఉండమనండి."

అచ్యుతం వెళ్లిపోయి అయిదు నిమిషా లయినా, ఇంకా అరుస్తూనే ఉంది భార్య, మొగుడిమీద. తనని కాదన్న ట్లుగా మౌనంగా పేపర్ చూస్తూండి పోయాడు ఆ ముసలాయన. ఆ రోజు రాత్రి వర్షం బాగా కురిసింది.

మరునాడు అయిదు గంటలకే బెట్టీ, ఆషా, సులోచన సిద్ధమయ్యారు. తరవాత చిత్ర, స్వాతి వచ్చారు. ఒకొక్కరు ఒకొక్క తీరుగా ఉన్నారు, అందంగా. చిత్ర చీరలో, స్వాతి బెల్‌బాటమ్స్‌లో, బెట్టీ గౌనులో, ఆషా పంజాబీ డ్రెస్‌లో, సులోచన స్కర్ట్, బ్లౌజ్‌లో అందంగా మెరిసి పోతున్నారు, ఒకరిని మించి ఒకరు.

అచ్యుతం మొదటిసారిగా వారిని చూసినప్పటికన్నా అందరి అందం, వయసు ఓ సంవత్సరం పెరిగాయి. ఎర్లీ, మిడిల్ టీన్స్‌లోని అందం వాళ్లది.

అయిదున్నర దాటుతున్నా రాలేదు వసంత. అచ్యుతమే వెళ్లి తీసుకు వచ్చాడు వసంతని. శాపనార్థాలు పెడుతూనే ఉంది వసంత సవతి తల్లి.

"ఎక్కండి" అన్నాడు కారు తలుపు తెరిచి.

"ఎక్కడిది ఈ కారు?" అడిగారు అంతా ఆశ్చర్యంగా.

"ఓ స్నేహితుడి దగ్గర తీసుకు వచ్చాను."

చిత్ర, స్వాతి, బెట్టీ, సులోచన వెనకాల కూర్చున్నారు. డ్రైవింగ్ సీట్లో అచ్యుతం, పక్కన వసంత, వసంత పక్కన ఆషా కూర్చున్నారు.

"మీకు డ్రైవింగ్ వచ్చా?" అడిగింది ఆషా ఆశ్చర్యంగా.

"అవును. వచ్చు" అన్నాడు అచ్యుతం, కారు పోనిస్తూ.

"మీ రెప్పుడూ చెప్పలేదే మాకు!" అన్నది బెట్టీ.

"నాకు చెప్పారు. ఏరోప్లేన్ కూడా నడపటం వచ్చు."


సరదా కోసం అబద్ధాలు తేలిగ్గా ఆడేస్తుంది సులోచన.

"నిజంగా?" అడిగింది స్వాతి.

"అవును. నిజం" అన్నాడు అచ్యుతం నవ్వుతూ.

అప్పుడే పంజరం లోంచి బయట పడ్డ చిలుక, గట్టుమీద నుంచి నీళ్లలో పడ్డ చేపపిల్ల గుర్తుకు వచ్చాయి అచ్యుతానికి, వసంతని చూస్తే.

చాలా సంతోషంగా ఉంది వసంత. అచ్యుతం భుజం మీద చేయి వేసి, తోవ పొడుగూతా మాట్లాడుతూనే ఉంది—చిన్నప్పుడు తను చూసిన తోలు బొమ్మలాట గురించి, సర్కస్ గురించి,



కొంచెం కొంచెం గుర్తున్న వాళ్ల అమ్మని గురించి.

దారి పొడుగుతా కబుర్లు చెబుతూనే ఉన్నారు అంతా.

"హలో, బాస్. వాట్ ఎ ప్లెజంట్ సర్‌ప్రైజ్!" అన్నారు అచ్యుతం స్నేహితులు నవ్వుతూ, ఆరుగురితో వచ్చిన అచ్యుతాన్ని చుట్టుముట్టి.

"డామ్ యు. ఇంతమంది గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారని నాకు మాట మాత్రమయినా చెప్పలేదే?" అడిగింది అచ్యుతాన్ని ఓ మెడికల్ స్టూడెంట్.

"సారీ. అవకాశం రాలేదు" అన్నాడు అచ్యుతం.

"యు ఆర్ ఎ లయర్!" అన్నది చనువుగా చూస్తూ.

తమ పరిచయాన్ని అమాయకంగా చూస్తున్న ఆ ఆరుగురిని గమనించి, నవ్వి ఊరుకున్నాడు అచ్యుతం.

అందంగా అలంకరించుకున్న సీతాకోకచిలకల్లాంటి అమ్మాయిలు అచ్యుతాన్ని ఎంతో పరిచయం ఉన్న వాళ్లలాగా పలకరిస్తూంటే, చిత్ర మనసులోనే తన అందం వాళ్ల అందంతో అంచనా వేసుకుంటూంది.

మొదటి అంశం ఇంగ్లీష్‌లో డ్రామా— 'దేవదాసు'. క్లుప్తంగా పదిహేను నిమిషాలలో ముగిసింది. నాటకం చూస్తున్నంత సేపు ఎవరికి వాళ్లు తమ పార్వతిగా, అచ్యుతం దేవదాసుగా ఊహించుకున్నారు.

లైట్ మ్యూజిక్‌లో మొదటి పాట వ్రాసింది అచ్యుతం. చాలా చక్కగా పాడాడు ఓ మెడికో. చాలా చిన్న పాట. కాని, ఎంతో బాగుంది. విషాదం ధ్వనించే బాణీ. ప్రియురాలిని వదిలి విదేశానికి వెళుతున్నప్పుడు మనసులో చెలరేగే భావాల రూపమే ఆ పాట.

తన పాట అయిన అరగంటకల్లా ఆరుగురితో బయలుదేరాడు అచ్యుతం, ప్రోగ్రామ్ పూర్తవకుండానే.

"మీ కోర్స్ పూర్తయిపోయిందా? సెండాఫ్ పార్టీనా ఇది?" అడిగింది చిత్ర.

అచ్యుతం సమాధానం చెప్పలేదు. మౌనంగా ఉండిపోయాడు.

కారు ఇంటికి వెళ్లలేదు. మధ్యలో ఓ చోట ఆగింది, పెద్ద ఇంటిముందు.

"ఎవరిది ఈ ఇల్లు?" అడిగింది వసంత.

"ఓ స్నేహితుడిది."

అందరూ అచ్యుతంతో పాటు కారు దిగి, లోపలికి నడిచారు. హాల్లోని సోఫాల్లో కూర్చుని ఉన్న వాళ్ల వంక చూసి, "ప్రశ్నేనా?" అని అడిగాడు సైకాలజీ ప్రొఫెసర్ రహస్యంగా.

తల ఊపాడు అచ్యుతం.

పనిమనిషి ట్రేలో కోకో కోలాలు తీసుకువచ్చి ఇచ్చింది, ఫ్రిజ్‌లోంచి అందరికీ. కోక్ పూర్తయ్యేదాకా సైకాలజీ ప్రొఫెసర్ ఆ ఆరుగురితో మాట్లాడుతూ ఉండిపోయాడు.

"నేను, అచ్యుతం ఇప్పుడే వస్తాము ఓ పావు గంటలో. ఆ మేగజైన్స్ చూస్తూండండి."

ఎదురుగా టేబుల్‌మీద ఉన్న మేగజైన్స్ వంక చూపించాడు ప్రొఫెసర్.

"మళ్లీ చెప్పండి మొదటినుంచి" అడిగాడు ప్రొఫెసర్ అచ్యుతాన్ని, పక్క గదిలోకి వెళ్లి కూర్చున్నాక.

గొంతు సర్దుకున్నాడు అచ్యుతం. చెప్పసాగాడు:

"దాదాపు సంవత్సరం క్రితం ఆ గది అద్దెకు తీసుకున్నాను. చేరిన నెల రోజుల్లోనే ఆ ఆరుగురు ఆడపిల్లలకీ నేనంటే ఇష్టం ఏర్పడింది అని గ్రహించాను. వీలయినంతవరకు నా మీద వాళ్లకి ఏర్పడ్డ ఇష్టం పెరిగేలా ప్రయత్నించాను అనేక విధాలుగా. వాళ్ల ఆనందం కోసం నా సరదాలు ఎన్నో వదిలేశాను. సాయంత్రం వాకింగ్, స్మోకింగ్ మొదలయిన అలవాట్లన్నీ పూర్తిగా మానేశాను.

వాళ్లకి నా మీద ఉన్న ఇష్టం క్రమంగా ప్రేమగా మారింది. ఒకళ్ల తరవాత ఒకరు వచ్చి తమ ప్రేమని వ్యక్తం చేశారు నాకు. నేనూ వాళ్లని ప్రేమిస్తున్నట్లుగా చెప్పాను."

తన ముఖంలోకి చూస్తూ నవ్వుతున్న ప్రొఫెసర్‌ని చూసి చెప్పడం ఆపాడు అచ్యుతం సిగ్గుగా.

"కారీ ఆన్. తప్పు లేదు. నీ వయస్సులో, ఆ పరిస్థితుల్లో అలా మభ్య పెట్టడం సహజం" అన్నాడు ప్రొఫెసర్ ప్రోత్సహిస్తూ.

"మభ్య పెట్టడం కాదు. నేను నిజంగానే వాళ్లని ప్రేమించాను ... ప్రేమిస్తున్నానుకూడా." ఆవేశంగా అన్నాడు.

"ఆ ఆరుగురినీ?"

"అవును, ఆ ఆరుగురినీ. నేనంటే ప్రతి ఒక్కరికీ తగని ఇష్టం. చిత్ర నన్ను పెళ్లి చేసుకోమని అడుగుతోంది. మిగతావాళ్లకూడా త్వరలోనే అడుగుతారు. నా కోసం ప్రాణం ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నారనిపిస్తుంది నాకు, వాళ్లు నేనంటే చూపించే ఆప్యాయత చూస్తే."

"అందరిలో మీకు ఎవరు బాగా నచ్చారో వాళ్లని పెళ్లి చేసుకుంటే ఏ సమస్యా ఉండదు."

"అక్కడే అసలు సమస్య ప్రారంభం అయేది. ఇన్నాళ్లూ నేను ఆ ఆరుగురిని నువ్వు లేకపోతే బ్రతకలేను అని నమ్మించాను. నిజం అంతేకూడా. నాకు అందరూ సమానమే. వాళ్లలో ఎవరినీ వివాహం చేసుకున్నా, మిగతా అయిదుగురూ బాధపడతారు. బాధపడటమే కాదు, నమ్మించి మోసం చేశానను కుంటారు. నాకు ఎవరి మనసూ నొప్పించడం ఇష్టం లేదు."

"క్షమించండి ఇలా అడుగుతున్నందుకు. వాళ్లలో ఎవరితోనయినా మీకు... మీకు శారీరక సంబం..."

"ఛీ ఛీ! ఎవరితోనూ లేదు. నేను అస్ఖలిత బ్రహ్మచారినని చెప్పుకోను. కాని, వాళ్లని ఆ దృష్టితో ఎప్పుడూ చూడ లేదు నేను. అవకాశం, అవసరం రాలేదు కూడా."

"గుడ్. అయితే, ఎవరినీ పెళ్లి చేసుకోకుండా మీ దారిని మీరు వెళ్లిపోవడం మంచిది. ఏ సమస్యా ఉండదు."

"వెళ్లనివ్వరు. అలా వెళ్లలేముకూడా. వాళ్లు ఆరుగురూ నా జీవితంలో ఓ

(తరువాయి 39 వ పేజీలో)



కలకత్తా ఆంధ్ర సంఘం ఇటీవల నిర్వహించిన 'ఆంధ్ర కేసరి' శతజయంతి ఉత్సవం జరిపినప్పటి ఫోటో. ఆంధ్ర సంఘం అధ్యక్షులు శ్రీ బుర్రా శివరామశాస్త్రి, ప్రధాన అతిథి పశ్చిమ వంగ మాజీ ముఖ్యమంత్రి శ్రీ ప్రఫుల్ల చంద్ర ఘోష్ చిత్రంలో ఉన్నారు.

# అద్దె కిచ్చిన...

(35 వ పేజీ తరువాయి)

భాగం అయిపోయారు. వాళ్లంటే నాకు ఇంత వ్యామోహం ఉంటుందని నేను ఎప్పుడూ ఊహించనయినా లేదు. ఇప్పుడు అర్థం అవుతోంది, వాళ్లు నన్ను విడిపోవలసి వచ్చినప్పుడు. వాళ్లని విడిచి దూరంగా బ్రతకగలను గాని, ఆ బ్రతుకు దుర్భరంగా ఉంటుంది."

"మీరు వెళ్లిపోతున్నట్లు తెలుసా వాళ్లకి?"

"ఇంతవరకు చెప్పలేదు. 'మెడికోస్ క్లబ్' సెండాఫ్ పార్టీ ఇచ్చింది ఈవేళ. ఏం చేయాలో తోచకపోతే, ఓ స్నేహితుడు మిమ్మల్ని కలుసుకుని సలహా తీసుకోమని మీ అడ్రెసు ఇచ్చాడు."

"ఈ పాటికి చెప్పేసి ఉండవలసింది మీరు."

"ఏం?"

"మీరు వాళ్లని వదిలి వెళ్లిపోవడం తప్పనిసరి అయినప్పుడు, ఆ సంగతి ముందే తెలియడం మంచిది. సరిగ్గా వెళ్లబోయేముందు తెలిస్తే బాధ ఎక్కువగా ఉంటుంది. ముందే తెలిసిపోతే, బాధ ఎక్కువ ఉండదు. తగ్గిపోతుంది క్రమంగా."

"అలా అయితే ఇంటికి వెళ్లేటప్పుడు చెప్పేస్తాను. వాళ్లు పెళ్లి గురించి నన్ను అడుగుతారు, ఒక్కొక్కరూ. ఏం చెప్పాలి? చేసుకోనా? చెప్పలేను."

"చేసుకోలేరుకూడా. ఆరుగురిని ఒకరే చేసుకుంటే చట్టం ఒప్పుకోదు. అందులో ఒకరిద్దరు తప్ప మిగతా వాళ్లకి ఇంకా పెళ్లి చేసుకునే అర్హత రాలేదు, చట్టం దృష్టిలో. పద్దెనిమిదేళ్ల లోపువాళ్లు."

"ఏం చేయాలి నేను?" అన్నాడు అచ్యుతం దీనంగా.

సెలాఫేన్ పేపర్‌లో చుట్టి ఉన్న సిగార్ తీసి, లైటర్‌తో అంటించి అన్నాడు సైకాలజీ ప్రొఫెసర్:

"మీది చాలా డెలికేట్ ప్రాబ్లెమ్. పెళ్లి చేసుకుంటానని నమ్మించి చేసుకోకుండా ఉండలేరు. ఏ ఒకరిని చేసుకున్నా మిగతా వాళ్లని అన్యాయం చేసినట్లవుతుంది, ఆశలు రేపి."

"అవును."

"మీరు ముందరే ఆలోచించి ఉండవలసింది ఈ విషయం."

"ఎప్పుడూ ఆలోచించలేదు. ఇలా పరిణమిస్తుందని అనుకోలేదుకూడా."

"ప్చ్! మీ వయసులో ఉన్న యువకులలో ఉన్న దౌర్బల్యమే ఇది. కనపడిన ప్రతి ఆడపిల్లతోనూ పరిచయం పెంచుకోవాలనీ, ప్రేమించబడాలనీ ప్రయత్నిస్తారు. చివరికి పెళ్లి ప్రసక్తి వచ్చినప్పుడు తోక ముడిచి పారిపోతారు. దీనివల్ల వాళ్లు ఎంత బాధ పడతారో గుర్తించరు మీరు."

"అవును. నేను చేసింది తప్పే ఒప్పుకుంటున్నాను. తప్పని ఇప్పుడే తెలుసుకున్నాను. ఏం చెయ్యను? కేవలం గది మాత్రమే అద్దెకు తీసుకోలేదు నేను డబ్బుకి. ఆ ఇంట్లో ఉన్న కన్నెపిల్లల హృదయాలుకూడా నాకు తెలియకుండానే అద్దెకు తీసుకున్నాను, ఆప్యాయత ఇచ్చి. గది తిరిగి ఇచ్చేసినంత తేలికగా వాళ్ల హృదయాలని తిరిగి ఇవ్వలేను. . . ఐ యామ్ ఇన్ ఎ ఫిక్స్."

సిగార్ తాగుతూ కొన్ని క్షణాలు ఆలోచిస్తూండిపోయాడు ప్రొఫెసర్. మౌనంగా ప్రొఫెసర్ వదిలే నీలం రంగు సిగార్ పొగ వంక చూస్తూండిపోయాడు అచ్యుతం.

"వాళ్లకి నీ మీద మంచి అభిప్రాయం, ఇష్టం ఉన్నాయి. ప్రస్తుతం. ఆ గదిలోంచి, వాళ్ల బారినుంచి బయటపడాలంటే ఒక ఉపాయం" అని ఆగాడు ఆయన.

"ఏమి టది?" అడిగాడు అచ్యుతం, ముందుకి వంగి ఆత్రంగా.

"నువ్వంటే వాళ్ల కున్న మంచి అభిప్రాయం చెరిగిపోతే, సహజంగా నీ మీద ఇష్టం, ప్రేమా పోతాయి. చెడు అభిప్రాయం ఏ విధంగా కలిగించుకోవాలో నేను చెప్పక్కరలేదు. చాలా తేలిక. ఉదాహరణకి చిత్ర వచ్చినప్పుడు చేయి పట్టుకుని లాగి పశువులా. . ."

"వద్దు, వద్దు. ప్రాణం ఉండగా అలా చేయలేను. నా చేత కాదు" అన్నాడు అచ్యుతం ఉద్వేగంగా.

అష్‌ట్రేలో సిగార్ బూడిద రాల్చి, చిన్నగా నవ్వుతూ అన్నాడు సైకాలజీ ప్రొఫెసర్: "నాకు తెలుసు, మీరు అందుకు ఒప్పుకోరని. వాళ్లందరికీ మీ మీద ఇప్పుడు ఉన్న ప్రేమ, ఇష్టం, ఆరాధన, ఆప్యాయత ఎక్కువ కాలం ఉండవు."

"కాదు. తప్పకుండా ఉంటాయి." దాదాపుగా అరిచాడు అచ్యుతం.

"ఉండవు. పొరపాటు పడుతున్నారు. హ్యూమన్ సైకాలజీ గురించి నాకు ముప్పై రెండేళ్లుగా తెలుసు. వాళ్లందరినీ చూశానుగా?"

"నేను నమ్మలేను. నేనంటే వాళ్లకి ప్రాణం."

"ఇప్పుడు మాత్రమే."

"ఎప్పటికీ ఉంటుంది."

"యూఆర్ రేషనల్ థింకింగ్. సింపిల్. వెరీ సింపిల్. అందరూ ఎర్లీ టీన్స్‌లో ఉన్నారు. టీన్స్‌లో ఉన్నప్పుడు ప్రేమించాలనీ, ప్రేమించబడాలనీ అందరికీ కోరిక కలగడం సహజం. అలా ప్రేమించబడాలనీ, ప్రేమించాలనీ కలలు గనే వయసు. ప్రేమించడానికి అందుబాటులో ఉన్న ఎవరినయినా ప్రేమిస్తారు. మీరు తప్ప ఇంకెవ్వరు అందుబాటులో లేరు. దొరకలేదు వాళ్లకి. మీలో ప్రత్యేకత ఏమీ లేదు—స్మార్ట్ నెస్సువాలిటీ, పెద్ద చదువు తప్ప. ఏమీ అనుకోకండి, ఉన్న మాట కుండబద్దలు కొట్టినట్లు చెప్పినందుకు."

జాగ్రత్తగా సైకాలజీ ప్రొఫెసర్ చెప్పేది బుర్ర కెక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు అచ్యుతం.

"మీ మీద ఉన్న ప్రేమ, ఆకర్షణ క్రమంగా తగ్గిపోతాయి, వయస్సు పెరిగి లోకం అంటే ఏమిటో తెలిసినకొద్దీ, కొత్త పరిచయాలు అభివృద్ధి అయిన కొద్దీ. మీరు ఇప్పుడే విడిపోతే మీ మీద ప్రస్తుతం వాళ్ల హృదయాలలో ఉన్న భావన ఎల్లకాలం నిలిచేందుకు ఆస్కారం ఉంది. టీన్స్ దాటగానే, ఇప్పుడు మీరు కనపడుతున్నంత ఆకర్షణీయంగా కనపడరు. ట్రూ. . . ఉదాహరణకి, రోమియో ఎండ్ జూలియట్. ఎర్లీ టీన్స్‌లోని ప్రేమికులు. వాళ్ల వయసు ఇంకా ఎక్కువ ఉంటే మామూలుగా ప్రవర్తించగలిగే వాళ్లు. మరణించే వాళ్లు కాదు."

మౌనంగా ఆలోచిస్తూండిపోయాడు అచ్యుతం, ప్రొఫెసర్ చెప్పిన మాటలు.

"అఫ్‌కోర్స్. ఇది నా థియరీ మాత్రమే. ప్రతి థియరీకి మినహాయింపు లుంటాయి."

"ఐ యామ్ ఇన్ ఎ సూప్."

"బయటపడవచ్చు దానిలోంచి. మీ రెక్కడా చదవలేదా? ఇంగ్లండ్‌లో ఎర్లీ టీన్స్ వాళ్లకే ఎక్కువగా పెళ్లి కాకుండా కడుపు వచ్చేది. ఆ వయస్సులో ప్రేమ సాధారణం. స్థిరమయిన ప్రేమ కాదు. అదే ప్రేమ ఇరవై అయిదేళ్ల అమ్మాయికి కలిగితే ఆ ప్రేమ శాశ్వతంగా ఉండటానికి ఆస్కారం ఎక్కువ ఉంది. వయసులో ఉన్నప్పుడు చెలరేగే కొత్త కోరికలతో వచ్చే ప్రేమ స్థిరమయింది కాదు."

"అంటే నేను ఇక్కడే ఉంటే కొన్నాళ్లకి నా మీద ఇష్టం తగ్గిపోతుం దంటారా?"

"మనుషుల సైకాలజీని జడ్జ్ చేయటంలో నేను ఘటికుణ్ణని చెప్పుకుంటాను. మీరు అది గర్వం అని భావించినా. ఇప్పుడు ఈ స్థితిలో మీరు బయట పడితే చాలా కాలం, బహుశా మట్టిలో కలిసిపోయేదాకా మీరు గుర్తుంటారు వాళ్లకి."

"తప్పు అడ్రెసు ఇచ్చి, మళ్లీ వస్తానని చెప్పి పారిపోనా?" అడిగాడు అచ్యుతం.

"మళ్లీ వస్తానని మాత్రం నమ్మించి వెళ్లండి. తప్పు అడ్రెసు ఇవ్వద్దు. కావాలంటే మీ అడ్రెసు కనుక్కోగలరు చిత్ర తలిదండ్రులు."

"మరేం చేయాలి?"

"ప్చ్! అసలు ఎప్పుడు ఈ యువకులలో మార్పు వస్తుందో! ప్రేమించటం చాలా తేలిక కాబట్టి ప్రేమిస్తారు, కనపడిన ప్రతి అమ్మాయిని. పెళ్లి గురించి, ఆ ప్రేమ పరిణామాన్ని గురించి ఆలోచించకుండా దిగుతారు రంగంలోకి. మనసుతో ఆటాడకూడదు."


"ఏమని చెప్పను వెళ్లేటప్పుడు?" అడిగాడు అచ్యుతం కొంచెం ఇబ్బందిగా.

సెలాఫేన్ పేపర్‌లో చుట్టి ఉన్న కొత్త సిగార్ తీసి అంటించి అన్నాడు సైకాలజీ ప్రొఫెసర్:

"మూడు విధాలుగా చేయవచ్చు. కాని, వాటిలో ఒక మార్గం నాకు బాగా నచ్చింది. మంచిది అవునో, కాదో నేను నిర్ణయించలేను. మూడూ విన్నాక ఏది మంచిదని తోస్తే అది చేయండి మీరు."

"చెప్పండి" అన్నాడు అచ్యుతం ఉత్సాహంగా.

(సశేషం)



(క్రిందటి సంచిక తరువాయి)

9

# అద్వైతించిన హృదయాలు

"రండి." ఆహ్వానించాడు అచ్యుతం, గుమ్మం దగ్గరే సంశయంగా నిలబడిపోయిన చిత్ర నాన్నని చూసి.

లోపలికి వచ్చి అన్నాడు ఆయన: "సారీ ఫర్‌ది డిస్టర్‌బెన్స్."

"నాట్‌టెటాల్." అచ్యుతం చదువు




మల్లాది
వెంకటకృష్ణమూర్తి

తున్న 'రీడర్స్ డైజెస్ట్' మూసి అన్నాడు, ఆయన కూర్చున్న తరవాత.

"ఏమీ తోచటం లేదు. అందుకే ఇది చదువుతున్నాను."

కొన్ని క్షణాలు ఆయన అచ్యుతం వంక పరిశీలనగా చూసి అన్నాడు, కొద్దిగా జంకుతూ: "మీతో ఓ చిన్న సంగతి మాట్లాడదామని వచ్చాను."

"చెప్పండి."

"మీరు వెళ్లిపోతున్నారుట?"

"అవును. నా కోర్స్ పూర్తయి పోయింది. ఎల్లుండి వెళ్లిపోతాను బహుశా."

"చిత్ర గురించి మీ అభిప్రాయ మేమిటి?"

"మంచిపిల్ల. మంచి స్నేహితురాలు."

"చిత్ర చెప్పింది రాత్రి నాకు. మీకు చిత్ర అంటే ఇష్టం ఉందను కుంటాను బాగా."

అచ్యుతం ఊహించగలిగాడు, చిత్ర నాన్న దేన్ని గురించి మాట్లాడుతున్నాడో.

"ఏం చెప్పింది చిత్ర?" అడిగాడు నవ్వుతూ.

"మీరు చిత్రని పెళ్లి చేసుకోవడానికి నిర్ణయించారని."

"అవును." చెప్పాడు అచ్యుతం కొద్దిగా సిగ్గుగా.

"నన్ను అడగమంది. అన్నీ మాట్లాడి, వీలయితే ముహూర్తం నిర్ణయించుదామని వచ్చాను."

"నేను మా ఊరు వెళ్లి మళ్లీ ఓ పదిహేను రోజుల్లో తిరిగి వస్తాను. నాతోపాటు మా అమ్మా, నాన్నాకూడా వస్తారు. మీరు వారితో అన్ని సంగతులూ మాట్లాడితే భావ్యంగా ఉంటుంది."

"మీరు ఒప్పుకున్నట్లేగా?"

"తప్పకుండా."

ఆయన కళ్లు మిలమిల మెరిశాయి. "థాంక్యూ" అన్నాడు సంతోషంగా.

"చిన్న రిక్వెస్ట్."

"చెప్పండి. కట్నం విషయమేగా? నా కున్నది ఇద్దరే. చిత్ర, స్వాతి. నా బిజినెస్ టర్నోవర్ సంవత్సరానికి ఏభై

వేలపైనే ఉంటుంది. నా తరవాత అదంతా నా అల్లుళ్ళకే. మీరు స్వంతంగా ప్రాక్టీస్ చేసుకుంటూ, ఈ వ్యాపారం కూడా చూసుకోవచ్చు. ఇంకా. . ."

చిన్నగా నవ్వి అన్నాడు అచ్యుతం: "నేను కట్నం గురించి కాదు మాట్లాడేది."

"మరి?"

కుడిచేతి చూపుడు వేలిని ఎడంచేతి చూపుడు వేలితో మెలి వేస్తూ అన్నాడు అచ్యుతం: "మా వాళ్ళు వచ్చి,ముహూర్తం నిర్ణయించేదాకా ఈ సంగతి అందరి మంచి రహస్యంగా ఉంచాలి— స్వాతి మంచికూడా."

* * *

"నేను వెళ్ళిపోతున్నారా నిజంగా?" అడిగింది బెట్టీ.

"అవును" అన్నాడు అచ్యుతం సూట్‌కేస్‌లో బట్టలు సర్దుకుంటూ.

"ఏం? మాట్లాడవేం?" అడిగాడు అచ్యుతం, రెండు నిమిషా లాగి, సూట్‌కేస్ మూస్తూ.

సమాధానం చెప్పలేదు బెట్టీ. వెనక్కి తిరిగి చూశాడు.

ఏడుస్తూంది బెట్టీ.

"బెట్టీ!"

దగ్గరికి పరుగెత్తి కెళ్ళి భుజంమీద చేయి వేశాడు ఓదార్పుగా.

"బెట్టీ! ఏడవకు. పదిహేను రోజుల్లో మళ్ళీ తప్పకుండా తిరిగి వస్తాగా?"

ఏడుస్తూనే ఉంది బెట్టీ.

"ప్లీజ్. డోంట్ క్రై."

బెట్టీ నుదురుమీద ముద్దు పెట్టుకున్నాడు అచ్యుతం.

"తప్పకుండా తిరిగి వస్తారా?"

"తప్పకుండా. ఏడవకు. ఇదే మొదటి సారి నిన్ను ఏడుస్తుండగా చూడటం. ఏడుస్తూంటే నువ్వు ఎలా ఉన్నావో తెలుసా?"

'ఎలా?' అన్నట్లుగా చూసింది బెట్టీ.

"కోతిలా." కోతిని అనుకరిస్తూ అన్నాడు అచ్యుతం.

ఏడుస్తూనే నవ్వింది బెట్టీ.

"ఏడవకు. ఐ విల్ కమ్ బేక్."

బెట్టీ వెళ్ళిన కొద్ది నిమిషాల తరవాత వచ్చింది ఆషా.

సామాను పాక్ చేస్తున్న అచ్యుతం ఎక్కిళ్ళు విని తల ఎత్తి చూశాడు.

ఏడుస్తూంది ఆషా. ఆషాకూడా!

"డోంట్ బి సిల్లీ. ఏడవకు."

దగ్గరికి వెళ్ళి కన్నీళ్ళు తుడిచాడు అచ్యుతం. ఓదార్పుతో ఏడుపు ఇంకా ఎక్కువయింది ఆషాకి.

"ప్లీజ్. ఏడవకు. నేను చూడలేను." అచ్యుతం గొంతు వణికింది.

ఆవేశంగా ఆషాని దగ్గరికి లాక్కుని పెదిమల మీద మృదువుగా ముద్దు పెట్టుకున్నాడు అచ్యుతం.

"ఐ విల్ బి బేక్" అన్నాడు దృఢంగా.

"నిజంగా?"

"మీ రంతా ఎందుకు నమ్మరు? తప్పకుండా తిరిగి వస్తాను పదిహేను రోజుల్లో."

"వచ్చిన తరవాత మన. . ."

సిగ్గుతో ఆగిపోయింది ఆషా. పెళ్ళి గురించే అని గ్రహించ గలిగాడు అచ్యుతం.

"నువ్వు లేకుండా నేను బ్రతకాలనా?" అడిగాడు ఆషా కళ్ళలోకి చూస్తూ.



ఛాయాచిత్రం (బహుమతి-2)

దూరంగా జరిగాడు, మృదువుగా ఆషా బుగ్గలు పుణికి.

సాయంత్రం వచ్చింది సులోచన కాన్వెంట్ నుంచి రాగానే.

"డామిట్. ఎక్కడికి మీరు వెళ్ళేది?" అడిగింది సులోచన, గది నిండా పాక్ చేయబడ్డ సామాన్ల వంక చూసి.

"ఊరికి."

"వెళ్ళనివ్వం" అన్నది దౌర్జన్యంగా.

"మళ్ళీ వచ్చేస్తాగా?"

"అయినా వెళ్ళనివ్వం."

"ప్లీజ్."

"వీల్లేదు."

"ప్లీజ్."

"నో."

అంతవరకు నిబ్బరంగా ఉండగలిగింది కాని, ఇక ఉండలేకపోయింది సులోచన. ఏడుపు మొహం పెట్టింది.

"మళ్ళీ మీరు తప్పక రావాలి నా దగ్గరికి. స్టెతస్కోప్ చూసినప్పుడల్లా మీరే గుర్తుకు వస్తారు."

"సిల్లీ గర్ల్. ఇంతవరకూ నువ్వు ఏడవటం చూడలేదు. దయచేసి చూపించ వద్దు. చూడలేను."

"చూపించను."

కళ్ళమ్మట నీళ్ళు తిరుగుతూంటే బయటికి పరుగెత్తింది సులోచన.

రాత్రి వచ్చింది స్వాతి. ఏడవలేదు అందరిలాగ. ధైర్యంగా ఉండగలిగింది.

"రేపేనా?" అడిగింది.

"అవును." చెప్పాడు.

"అంటిల్ డెత్ డు అజ్ పార్ట్!" నవ్వుతూ అంది.

"ఏమిటి?" అడిగాడు మళ్ళీ అర్థం గాక.

"అంటిల్ డెత్ డు అజ్ పార్ట్. క్రిస్టియన్స్ పెళ్ళిలో చెపుతారు. చావు మనని విడదీసేదాకా కలిసే ఉండాలని అర్థం."

దగ్గరికి లాక్కున్నాడు స్వాతిని ఆప్యాయంగా.

"ఐ ఓంట్ లీవ్ యు అంటిల్ డెత్ డు అజ్ పార్ట్" అన్నాడు.

తృప్తిగా నిట్టూర్చింది స్వాతి.

"మీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూంటాను. త్వరగా తిరిగి రావాలి. మీ ఉత్తరం రాకపోతే నేనే వచ్చేస్తాను" అన్నది చిత్ర.

"అక్కడేం తెలుసా?" అడిగాడు అచ్యుతం.

"తెలియదు."

"మరెలా వస్తావ్?" నవ్వి అన్నాడు మళ్ళీ: "త్వరగానే వచ్చేస్తాను. నెల రోజుల్లో ముహూర్తం నిర్ణయం అయిపోతుంది."

"దేనికి ముహూర్తం?" అడిగింది చిత్ర సందేహంగా.

"ఊరికేనే. ముందరే అందరికీ తెలిస్తే బాగుండదు. ఒకేసారి సర్‌ప్రైజ్ న్యూస్ ఇవ్వచ్చు."

వసంత!

అందరికన్నా చివర వచ్చింది వసంత, అచ్యుతం వెళ్ళిపోతున్నాడన్న వార్త తెలిసి. అవును మరి. వసంత అదృష్టం అందరి కన్నా చివరలో ఉంది, ప్రతి విషయం లోనూ. అది వాలుగా సారి వసంత ఈ సంవత్సరంలో అచ్యుతం గదికి రావటం.

"నన్ను మీరు నాతో చెప్పింది చేస్తారా?" అడిగింది వసంత అచ్యుతం వంక జాలిగా చూస్తూ.

"చేస్తాను." చెప్పాడు అచ్యుతం.

"తప్పకుండ?"

"తప్పకుండా" అన్నాడు అచ్యుతం దృఢంగా. "తప్పకుండ. నెల రోజుల్లో తిరిగి వస్తాను. మీ నాన్నతో మాట్లాడి ఒప్పిస్తాను. కట్నం అక్కరలేదు నాకు. నీకు కష్టాలు తప్పిపోతాయి. పదేళ్ళ తేడా మనిద్దరికీ. ఫర్వాలేదు. తరవాత సంతోషంగా ఉండచ్చు. ఏం?"

"అలాగే!" కొంచెం దిగులుగా నవ్వింది వసంత. ఇంకేమీ మాట్లాడలేదు వసంత. వెళ్ళి పోయింది వెక్కుతూ.

ఆరుగురూ సహాయం చేశారు సామాను సర్దుకోవడంలో. వసంత సవతి తల్లి తప్ప మిగతా అంతా వచ్చి పలకరించారు అచ్యుతాన్ని, అన్ని వాటాల లోని వాళ్ళు.

"ఈవేళ ఉదయం మా ఇంట్లో భోజనానికి రావాలి మీరు." ఆహ్వానించింది సులోచన.

"సారీ. ఇప్పుడు కాదు. ఈసారి వచ్చాక."

సులోచనకు ఏడుపు, కోపం వస్తున్నట్లు గమనించాడు అచ్యుతం.

"ఈసారి తప్పకుండా వస్తాను. అప్పుడు చేపలకూర, కోడి పలావ్, ఆమ్లెట్, మటన్ బిర్యాని. . ."

( తరువాయి 95వ పేజీలో )

(91 వ పేజీ తరువాయి)

[illegible]

"[illegible] ఉన్నారు" అన్నారు [illegible]

[illegible] నాకు [illegible] కూర్చోబోతూ [illegible] ఆశ్చర్యం. [illegible] దేశము అయ్యే, [illegible]

[illegible] అక్షి [illegible] ఫోటో [illegible]

[illegible]

"మనుష్యులందరికీ ఏడిచి వెళ్ళిపోకు [illegible]" అన్నాడు [illegible] తండ్రి.

అచ్యుతం చేతికోసి తన గది తాళం [illegible] ఇస్తూ అన్నాడు ఆయనతో "[illegible]. అద్దెకు తీసుకున్న ఈ గదిని తిరిగి ఇచ్చేసినంత తేలికగా హృదయాల్ని, మంచితనాన్ని, ఆప్యాయతని తిరిగి ఇచ్చేయలేను. జీవితాంతం నాతో ఉండేవి అవి."

అచ్యుతం గుండెలు బరువెక్కాయి, వాళ్ళని శాశ్వతంగా వదలాలంటే. ఇంక ఎన్నడూ వాళ్ళని తిరిగి చూడలేడు— చూడకూడదు.

రెండవ సారి అచ్యుతం కళ్ళలో నీళ్ళు చూశారు ఆ ఆరుగురు. మొదటి సారి బెట్టీ నాన్న మరణం అప్పుడు.

"ఆల్ ది బెస్ట్."

"గుడ్‌లక్."

"సోలాంగ్."

"కీప్‌రైటింగ్."

అందరూ తలో విధంగా చెప్పారు వీడ్కోలు.

"హెచ్."

చేతులు ఊపుతున్నారు అంతా, వజల నయనాలతో.

అందరి చూపులూ అచ్యుతం మీదే.

ఏక్సిలరేటర్ బలంగా నొక్కాడు టాక్సీ డ్రైవర్.

## 10

అచ్యుతం వెళ్ళి వారం రోజు లయి పోయింది అప్పుడే. కాని, ఇంకా ఎవరికీ అచ్యుతం మీద బెంగ తగ్గలేదు. మూసి ఉన్న ఆ గది తలుపుల వంక, ఖాళీగా వేలాడుతున్న తాళంకప్ప వంక చూస్తారు దిగులుగా. వాళ్లకే ఆశ్చర్యంగా ఉంది— సంవత్సరంలో తమని అచ్యుతం ఇంతగా ఎలా ఆకట్టుకోగలిగాడో!

ఒక రోజు యూనివర్సిటీలో పనిచేసే సైకాలజీ ప్రొఫెసర్, రెజిమెంటల్ బజారు దగ్గర అచ్యుతం అద్దెకి ఉన్న ఎప్పటి మేడ లోకి వెళ్లాడు.

ఆరుగురు అమ్మాయిలు [illegible] ఉన్న సిమెంట్ బెంచీ మీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. చిత్ర ఆయన్ని చూసి గుర్తు పట్టి, లేచి నిలుచుంది.

"అచ్యుతం నుంచి ఏదయినా ఉత్తరం వచ్చిందా? వెళ్లిన దగ్గరి నుంచి ఉత్తరం లేదు ఇంతదాకా." అడిగింది చిత్ర. నాలుగు రోజులనుంచి ఆశగా ఉత్తరం కోసం ఎదురు చూస్తోంది చిత్ర.

"లేదు." చెప్పాడు ప్రొఫెసర్.

"కూర్చోండి."

లేచి నిలబడ్డారు అంతా.

"ఫర్వాలేదు" అని కొన్ని క్షణాలు తటపటాయించి అడిగాడు ప్రొఫెసర్: "మీకు ఇంకా తెలియదా?"

"ఏమిటి? తెలియదు" అన్నారు అంతా ఆత్రంగా.

"అయితే, మీ కో చెడ్డవార్త తీసుకొచ్చాను."

"ఏమిటి?"

"అచ్యుతం. . ."

"అచ్యుతం? ఏమిటి? ఏమయింది అచ్యుతానికి?"

"అచ్యుతం ఎక్కి వాళ్ల ఊరు వెళుతున్న టాక్సీకి ప్రమాదం సంభవించింది."

"గాడ్! ఎప్పుడు?" అరిచారు అంతా.

"ఆ రోజే."

"ఇప్పుడు ఎక్కడ ఉన్నారు?" అడిగింది సులోచన ఆత్రంగా.

"ఆ రోజే హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు వెంటనే."

"ఎక్కడ?" అడిగింది బెట్టీ.

"ఎలా ఉన్నారు ఇప్పుడు?" అడిగింది చిత్ర.

"సారి. అంతా అయిపోయింది" అన్నాడు. ఆయన కొన్ని క్షణాలు ఆగి.

"అంటే చచ్చిపోయాడా?" అడిగింది స్వాతి.

"అవును. దహనంకూడా అయి పోయింది."

"మేం నమ్మలేం." అరిచారు గొంతు చించుకుని.

సంగతి పూర్తిగా తెలియగానే, దుఃఖం పైకి తన్నుకు వచ్చింది. ఏడుస్తున్నారు అంతా— ఒక్కరు తప్ప మిగతా అందరూ.

"ప్లీజ్, ఊరుకోండి" అన్నాడు ప్రొఫెసర్ ఇబ్బందిగా.

"డామ్ గాడ్. బుద్ధి లేదు. ఐ హేట్ క్రైస్ట్" అన్నది బెట్టీ.



మంటల వానలు

ఫోటో—కె. వి. రావు (మద్రాసు-54)



"[illegible]" [illegible] స్వాతి

[illegible] చిత్ర.

"[illegible]" [illegible] ప్రొఫెసర్

[illegible] వాళ్ళ [illegible] చెప్పారు [illegible]

వసంత [illegible] తల్లికికూడా కళ్ళు చెమ్మగిల్లాయి!

•

"మై డియర్ బాయ్,

నే నిచ్చిన సలహాల్లో నువ్వు పాటించింది ఎంతవరకు మంచిదో కాలమే నిర్ణయించాలి. ఆ ఆరుగురూ నువ్వు [illegible] మరణించావనే నమ్మారు. నిజానికి వాళ్ల దుఃఖం చూడలేకపోయాను.

ఇప్పుడు వాళ్లకి నీ మీద ఉన్న ఆరాధన, ప్రేమ, ఇష్టం, ఆప్యాయత లాంటివి చివరిదాకా వాళ్లలో నిలిచి ఉంటాయి. నువ్వీ లోకంలో లేవు వాళ్ల దృష్టిలో. వాళ్లకి కనపడే ప్రయత్నం చేయకు.

పెద్దవాళ్లయి, పెళ్లయి, పిల్లలు పుట్టి, సంసారంలో మునిగి, తేలి, అరవై ఏళ్ళు వచ్చినా వాళ్లకి నీ ఇరవై నాలుగేళ్ల రూపమే గుర్తు ఉంటుంది. అదృష్ట వంతుడివి. మళ్లీ మరోసారి ఇలాంటి పొరపాటు చేయకు.

ఒక విషయం మాత్రం పూర్తిగా నిజం. నువ్వు వాళ్ల హృదయాల్ని కేవలం అద్దెకి మాత్రమే తీసుకున్నావు. వాళ్ళు నీ హృదయాన్ని అద్దెకి కాదు— స్వంతానికి తీసుకున్నారు.

ఉంటాను."

ఉత్తరం మరోసారి చదివి, సంతకం పెట్టాడు సైకాలజీ ప్రొఫెసర్. ఉత్తరం మడిచి, కవరులో పెట్టి అతికించి, కవరుపైన అచ్యుతం అడ్రెసు వ్రాశాడు.

• • *

కాని, ఒక సంగతి మాత్రం ఆ ఇద్దరికీ తెలియదు. బహుశా ఎప్పటికీ తెలియదేమో? ఆ ఆరుగురిలో ఒకరు సైకాలజీ ప్రొఫెసరు ఇంట్లో ఆయన గదిలో అచ్యుతం, ప్రొఫెసర్ మాట్లాడుకున్న విషయాలలో చాలా భాగం వినటం సంభవించింది. అయినా, అచ్యుతం అంటే ప్రేమ తగ్గలేదు ఆ అమ్మాయికి. ఈ పాటికి అచ్యుతం బ్రతికే ఉన్నాడన్న సంగతి మిగతా అయిదుగురికి చెప్పే ఉంటుందా? ఏమో?

(సమాప్తం)